STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 354 | ఎడిటర్ : అలీ ముర్తుజా | బుధవారం 25 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |



సెప్టిక్ ట్యాంక్‌లో ముగిసిన మూడు ప్రాణాలు!

బాచుపల్లిలో ముగ్గురు యువ పారిశుద్ధ్య కార్మికుల మృతి


విషవాయువులు, ప్రాణవాయువు కొరతపై అనుమానాలు

భద్రతా ప్రమాణాల అమలుపై పోలీసుల ఆరా

మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం

2

కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు



26న అచ్చంపేటలో ప్రారంభం

స్థానిక నేత కార్మికులకు ఉపాధి కల్పించేలా తయారీ

రేషన్‌కార్డులో 18 ఏళ్లు నిండిన మహిళలకు పంపిణీ

2



అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు.. వేగం పెంచాలి!

- జనవరిలో మూసీ పునరుజ్జీవం తొలి దశ పనులు
- రేడియల్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి
- సమగ్ర అధ్యయనంతో పీఆర్ఆర్ఎస్‌కు ప్రణాళికలు
- మిరాలం చెరువులో పూడిక తొలగించాలి
- నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
- మున్సిపల్, పట్టణాభివృద్ధిపై సీఎం సమీక్ష

క్యూర్, ప్యూర్ ప్రాంతాల్లో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి వాటికి సంబంధించి స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షించారు. మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్ల పురోగతిని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు ఫేజ్-1లో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.20 కి.మీ ప్రాంతాన్ని జోన్-1 ఏ గా, ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కి.మీ ప్రాంతాన్ని జోన్-1 బీ గా విభజించి పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

2

కాంగ్రెస్‌లో అసమ్మతి సెగలు సందీప్‌కు సవాళ్లు!

కాంగ్రెస్‌లో క్రమశిక్షణ గాడిన పడేనా?



- కొత్త ఇన్‌చార్జి బీఎం సందీప్‌కు తొలి పర్యటనలోనే సవాళ్లు
- మంత్రులతో విడివిడిగా సమీక్షా సమావేశాలు
- బహిరంగ విమర్శలతో పార్టీకి ఇబ్బందులు
- రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తికి పరిష్కారం దొరికేనా?
- పార్టీ, ప్రభుత్వ మధ్య సమన్వయంపై దృష్టి

తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు, నేతల మధ్య సమన్వయ లోపం, క్రమశిక్షణ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయడం కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జి బీఎం సందీప్‌కు ప్రధాన సవాల్‌గా మారింది. రాష్ట్ర వ్యవహారాల బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన ఆయన గాంధీభవన్‌లో వరుస సమావేశాలు నిర్వహించారు. మీనాక్షి నటరాజన్ స్థానంలో నియమితులైన సందీప్, పొలిటికల్ అఫైర్స్ కమిటీతో సమావేశం కావడంతో పాటు మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మలతో విడివిడిగా చర్చలు జరిపారు. అయితే, తొలి పర్యటనలో ఆయన చేసిన సూచనలు గతంలో ఇన్‌ఛార్జులుగా పనిచేసినవారు చెప్పిన అంశాలకే పరిమితమయ్యాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

హైదరాబాద్, నవంబర్ 24 (సమయం న్యూస్): తెలంగాణ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు, నేతల మధ్య సమన్వయ లోపం, క్రమశిక్షణ ఉల్లంఘనలకు అడ్డుకట్ట వేయడం కొత్త ఏఐసీసీ ఇన్‌చార్జి బీఎం సందీప్‌కు ప్రధాన సవాల్‌గా మారింది. రాష్ట్ర వ్యవహారాల బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన ఆయన గాంధీభవన్‌లో వరుస సమావేశాలు నిర్వహించారు. మీనాక్షి నటరాజన్ స్థానంలో నియమితులైన సందీప్.. పొలిటికల్ అఫైర్స్ కమిటీతో సమావేశం కావడంతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో విడివిడిగా చర్చలు జరిపారు. అయితే, తొలి

మిగతా 2 లో

డ్రగ్స్ రహిత భారత్ కోసం ప్రజా ఉద్యమం

నేటి నుంచి 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర

అంబర్‌పేట నుంచి ఫిల్మ్‌నగర్ వరకు కార్యక్రమం

2029 చివరి నాటికి డ్రగ్స్ నియంత్రణ లక్ష్యం

యువతను క్రీడల వైపు మళ్లించాలి: కిషన్‌రెడ్డి



3



3

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో జంబ్లింగ్ లేనట్టే!

- సొంత కళాశాలల్లోనే ప్రాక్టికల్ పరీక్షలు
- తెలంగాణ ఇంటర్ బోర్డు కీలక నిర్ణయం
- ప్రథమ సంవత్సరం విద్యార్థులకూ ప్రాక్టికల్స్
- జనవరి 29 నుంచి పరీక్షలు ప్రారంభం
- రోజుకు రెండు విడతల్లో పరీక్షల నిర్వహణ

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు 10 వేల కోట్ల కార్యాచరణ!

- ఐదు నెలలపాటు నెలకు రూ.2 వేల కోట్లతో పనులు
- చెరువులు, వాగులు, కాలువల పునరుద్ధరణకు ప్రాధాన్యం
- నీటి సంరక్షణతోపాటు గ్రామీణ ప్రజలకు ఉపాధి
- ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి
- ఏడాదికి సరిపడా బియ్యం నిల్వలు సిద్ధం
- తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ ఏర్పాట్లపై ఉత్తమ్ సమీక్ష



ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే సంభావ్య కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రూ.10 వేల కోట్ల అంచనాతో ఐదు నెలల ప్రత్యేక కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సంక్రాంతి అనంతరం ప్రతి నెలా రూ.2 వేల కోట్ల విలువైన పనులు చేపట్టాలని ప్రతిపాదించినట్లు తెలిపారు.

2



ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్రీగా రిజిస్ట్రేషన్

- ఏడాదిలోపు నిర్మాణాలు పూర్తి
- 26 నియోజకవర్గాల్లో టవర్ల నిర్మాణం
- రెరాలో నమోదైన తొలి ప్రభుత్వ గృహ ప్రాజెక్టు

2

భారత్ నుంచి స్వదేశానికి హసీనా



- సంకెళ్లతో తీసుకొస్తామన్న బంగ్లాదేశ్ మంత్రి!
- డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు వెళ్తున్న షేక్ హసీనా..
- హైవేల దిగ్బంధానికి పిలుపునిచ్చిన అవామీ లీగ్..

4

కలెక్టర్‌కే వేధింపులు.. హైకోర్టు ఆగ్రహం

- మహిళా కలెక్టర్‌కు అసభ్య సందేశాలు పంపినట్లు ఆరోపణలు
- టీవీకే ఎమ్మెల్యేపై ఎఫ్ఐఆర్



4

ప్రధాని మోదీకి జర్మనీ ఛాన్సలర్ మెర్జ్ ఫోన్..



4



సెప్టిక్ ట్యాంక్‌లో ముగిసిన మూడు ప్రాణాలు!

బాచుపల్లిలో ముగ్గురు యువ పారిశుద్ధ్య కార్మికుల మృతి

విషవాయువులు, ప్రాణవాయువు కొరతపై అనుమానాలు

హైదరాబాద్, నవంబర్ 24 (సమయం న్యూస్): బతుకుదెరువు కోసం సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు దిగిన ముగ్గురు యువ కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. హైదరాబాద్‌లోని బాచుపల్లి దినేశ్ ఆరిక్ అపార్ట్‌మెంట్స్‌లో మంగళవారం ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. మృతులను సుమన్ (24), సురేష్ (25), పవన్ (25)గా పోలీసులు గుర్తించారు. వీరంతా సెప్టిక్ ట్యాంకులను శుభ్రపరిచే ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నారు. సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేసేందుకు లోపలికి దిగిన కార్మికులు ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టి ముగ్గురి మృతదేహాలను వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ట్యాంక్‌లో పేరుకుపోయిన విషవాయువులు లేదా ప్రాణవాయువు కొరత కారణంగా ఊపిరాడక కార్మికులు మృతి చెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. అయితే పోస్టుమార్టం నివేదిక అనంతరమే మృతికి కచ్చితమైన కారణాలు వెల్లడికానున్నాయి. ట్యాంక్‌లోకి దిగే ముందు విషవాయువుల తీవ్రతను పరీక్షించారా? కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు అందించారా? అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ముగ్గురు యువ కార్మికుల మృతితో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాదకరమైన పారిశుద్ధ్య పనుల్లో కార్మికుల ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి గుర్తుచేసింది.

ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు రూ.10 వేల కోట్ల కార్యాచరణ!

ఐదు నెలలపాటు నెలకు రూ.2 వేల కోట్లతో పనులు

చెరువులు, వాగులు, కాలువల పునరుద్ధరణకు ప్రాధాన్యం

నీటి సంరక్షణతోపాటు గ్రామీణ ప్రజలకు ఉపాధి

తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 24 (సమయం న్యూస్): ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే సంభావ్య కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు రూ.10 వేల కోట్ల అంచనాతో ఐదు నెలల ప్రత్యేక కార్యాచరణను రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సంక్రాంతి అనంతరం ప్రతి నెలా రూ.2 వేల కోట్ల విలువైన పనులు చేపట్టాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. తెలంగాణ పెట్టుబడుల సదస్సులో భాగంగా నిర్వహించనున్న క్లైమేట్ కాంక్లేవ్ ఏర్పాట్లపై మంగళవారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లకు శాస్త్రీయ, ఆచరణాత్మక పరిష్కారాలను సూచించే వేదికగా ఈ సదస్సు నిలవాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఎల్‌నినో సన్నద్ధత కార్యక్రమాన్ని సదస్సులో ప్రత్యేకంగా ప్రదర్శించనున్నట్లు మంత్రి తెలిపారు. నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో చెరువులు, వాగులు, కాలువల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణ, గ్రామీణ నీటి వనరుల పరిరక్షణకు సంబంధించిన పనులు చేపట్టనున్నట్లు వివరించారు. వ్యవసాయ పనులు తగ్గే కాలంలో గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడం కూడా ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కరువు పరిస్థితులు తలెత్తినా ప్రజలకు తాగునీరు, ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సదస్సులో వివరించాలని మంత్రి సూచించారు. వచ్చే వర్షాకాలం వరకు జలాశయాల్లో నీటి నిల్వలను కాపాడేందుకు అధిక నీరు అవసరమయ్యే వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాలకు ఏడాదిపాటు సరిపడా బియ్యం నిల్వలు రాష్ట్రంలో ఉన్నాయని వెల్లడించారు. పంట దిగుబడులు తగ్గినా ఆహార భద్రతకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిల్వలు ఉపయోగపడతాయన్నారు. పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విస్తరణ, శుద్ధి చేసిన మురుగునీటిని పరిశ్రమల్లో వినియోగించడం, నికర సున్నా కర్బన ఉద్గారాల లక్ష్య సాధనపైనా సమీక్షలో చర్చించారు. రాష్ట్రంలోని డేటా సెంటర్లు తమ విద్యుత్ అవసరాల్లో కనీసం 51 శాతాన్ని పునరుత్పాదక ఇంధన వనరుల నుంచి సమకూర్చుకోవాలనే నిబంధన అమల్లో ఉందని అధికారులు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన వాతావరణ అనుకూల నమూనాలతోపాటు ఇక్రిశాట్ గుర్తించిన ఉత్తమ విధానాలను సదస్సులో ప్రదర్శించాలని మంత్రి సూచించారు. ఈ సదస్సులో పర్యావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, పెట్టుబడిదారులతోపాటు సర్పంచ్‌లు సహా సుమారు 125 మంది గ్రామీణ ప్రతినిధులను భాగస్వాములను చేయనున్నారు. నీటి భద్రత, సుస్థిర వ్యవసాయం, జీవవైవిధ్య పరిరక్షణ, పట్టణ ఉష్ణోగ్రతల నియంత్రణ, స్వచ్ఛ ఇంధనం తదితర అంశాలపై విస్తృత చర్చలు నిర్వహించనున్నారు. పర్యావరణ పర్యాటకం, గ్రీన్ క్రెడిట్లు, వ్యర్థాల పునర్వినియోగం, పునరుత్పాదక ఇంధన రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయనున్నారు. సమీక్షలో రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీజీ ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణభాస్కర్, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో అసమ్మతి సెగలు.. సందీప్‌కు సవాళ్లు!

మొదటి పేజీ తరువాయి

పర్యటనలో ఆయన చేసిన సూచనలు గతంలో ఇన్‌ఛార్జులుగా పనిచేసినవారు చెప్పిన అంశాలకే పరిమితమయ్యాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నేతలంతా ఐక్యంగా పనిచేయాలని, విభేదాలను పక్కనపెట్టి రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు కృషి చేయాలని ఆయన సూచించినట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం రాష్ట్ర కాంగ్రెస్‌లో నెలకొన్న పరిస్థితులకు కేవలం ఐక్యతా సందేశాలు సరిపోతాయా? నేతల వ్యవహారశైలిలో మార్పు తీసుకొచ్చేందుకు ఎలాంటి చర్యలు చేపడతారన్నది చర్చనీయాంశంగా మారింది.

అదుపు తప్పుతున్న నేతల వ్యవహారశైలి

తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రస్తుతం ఐక్యతతో పాటు పార్టీ క్రమశిక్షణను కాపాడటం కూడా పెద్ద సమస్యగా మారింది. అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే సొంత పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ప్రభుత్వ పనితీరుపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బహిరంగంగా విమర్శలు చేయడం అధిష్ఠానానికి ఇబ్బందిగా పరిణమించింది. ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పలుమార్లు బహిరంగ వేదికలపై చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. ప్రభుత్వ నిర్ణయాలు, పాలనా విధానాలపై సొంత పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తం చేయడంతో ప్రతిపక్షాలకు విమర్శలు చేసేందుకు అవకాశం లభిస్తోంది. పార్టీ అంతర్గతంగా చర్చించి పరిష్కరించుకోవాల్సిన అంశాలు మీడియా, సామాజిక మాధ్యమాల్లో ప్రధాన చర్చలుగా మారుతున్నాయి. దీంతో కాంగ్రెస్ నాయకత్వం క్రమశిక్షణ విషయంలో ఎలాంటి వైఖరి అవలంబిస్తుందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

రాజగోపాల్‌రెడ్డి విషయంలో ఎలాంటి నిర్ణయం?

బహిరంగంగా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న నేతలతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించడం కొత్త ఇన్‌ఛార్జికి తక్షణ కర్తవ్యంగా మారింది. కేవలం ఐక్యత గురించి మాట్లాడటం కాకుండా, పార్టీ నిర్ణయాలకు విరుద్ధంగా వ్యవహరించే నాయకుల విషయంలో ఒక స్పష్టమైన విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ద్వారా కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి సందేశం పంపి, బీఎం సందీప్‌తో సమావేశం కావాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తికి గల కారణాలను తెలుసుకుని, ఆయనను పార్టీ వ్యవహారాల్లో సమన్వయం చేసే ప్రయత్నం జరగవచ్చని భావిస్తున్నారు. అయితే, ఈ తరహా చర్చలు నేతలను బుజ్జగించడంతోనే ముగుస్తాయా? లేక పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునే దిశగా అధిష్ఠానం ముందడుగు వేస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.



పార్టీ, ప్రభుత్వ మధ్య సమన్వయమే కీలకం

రాష్ట్ర కాంగ్రెస్‌లో పార్టీ నాయకత్వానికి, ప్రభుత్వానికి మధ్య సమన్వయం తీసుకురావడం కూడా బీఎం సందీప్ ముందున్న కీలక బాధ్యత. నల్గొండ జిల్లాకు చెందిన కీలక నేతల మధ్య విభేదాలు, మంత్రుల మధ్య సమన్వయ లోపం వంటి అంశాలు పరిష్కారం కావాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయాలు, పార్టీ కార్యక్రమాలు, రాజకీయ వ్యూహాల విషయంలో నాయకులందరినీ ఒకే వేదికపైకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. గతంలో రాష్ట్ర ఇన్‌ఛార్జులుగా పనిచేసినవారు సమీక్షా సమావేశాలు నిర్వహించడం, నేతల అభిప్రాయాలు సేకరించడం, అధిష్ఠానానికి నివేదికలు అందించడంతోనే పరిమితమయ్యారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పుడు బీఎం సందీప్ కూడా అదే విధానాన్ని అనుసరిస్తారా? లేక విభేదాల పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణ రూపొందించి అమలు చేస్తారా? అన్నది చూడాల్సి ఉంది. ఢిల్లీ అధిష్ఠానం మార్గదర్శకత్వంలో పార్టీ క్రమశిక్షణను పునరుద్ధరించడం, అసంతృప్త నేతలతో చర్చలు జరపడం, ప్రభుత్వానికి పార్టీకి మధ్య సమన్వయం పెంచడం వంటి అంశాలపై ఆయన తీసుకునే నిర్ణయాలపైనే రాష్ట్ర కాంగ్రెస్‌లో తదుపరి పరిణామాలు ఆధారపడి ఉండనున్నాయి.

అభివృద్ధి పనుల్లో జాప్యం వద్దు.. వేగం పెంచాలి!

జనవరిలో మూసీ పునరుజ్జీవం తొలి దశ పనులు

రేడియల్ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

సమగ్ర అధ్యయనంతో పీఆర్టీఎస్‌కు ప్రణాళికలు

మిరాలం చెరువులో పూడిక తొలగించాలి

నిర్మాణాల నాణ్యత విషయంలో రాజీపడొద్దు

మున్సిపల్, పట్టణాభివృద్ధిపై సీఎం సమీక్ష

హైదరాబాద్, నవంబర్ 24 (సమయం న్యూస్): క్యూర్, ప్యూర్ ప్రాంతాల్లో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి వాటికి సంబంధించి స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షించారు. మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్ల పురోగతిని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు ఫేజ్-1లో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.20 కి.మీ ప్రాంతాన్ని జోన్-1 ఏ గా, ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కి.మీ ప్రాంతాన్ని జోన్-1 బీ గా విభజించి పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. జనవరి 2027 లో ఫేజ్-1 పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని, ఇప్పటికే ఫేజ్-1 టెండర్ల ప్రక్రియను ప్రారంభించినట్లు వివరించారు. మిరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల పురోగతిపై సీఎం ఆరా తీశారు. జనవరి 2028 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు అధికారులు తెలిపారు. మిరాలం చెరువు అభివృద్ధితోపాటు చెరువులో ఎంతో కాలంగా పేరుకుపోయిన పూడికను తొలగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణం, భూసేకరణ పురోగతిని అధికారులు వివరించగా రేడియల్ రోడ్ల నిర్మాణంలో పనులను మరింత వేగం పెంచాలని సూచించారు. గండిపేట వద్ద నిర్మాణంలో ఉన్న ఆధునిక గోశాల పనుల పురోగతిని ఆరా తీసిన ముఖ్యమంత్రి మార్చి 2027 నాటికి పూర్తి చేసేలా పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. హైదరాబాద్‌లో పీఆర్టీఎస్(పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టం) ఫేజ్-1 కు సంబంధించి టెక్నో ఎకానమీ ఫీజిబిలిటీన గురించి అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. కూకట్‌పల్లి నుంచి రాయదుర్గ్ మీదుగా బయో డైవర్సిటీ వరకు అలైన్‌మెంట్ సాధ్యాసాధ్యాలను, బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి సెక్రటేరియట్, బషీర్‌బాగ్ మీదుగా రాణీగంజ్ వరకు అలైన్‌మెంట్ ప్రతిపాదనల గురించి అధికారులు వివరించారు. దీంతోపాటు నెక్లెస్ రోడ్, రాయదుర్గ్, పీపుల్స్ ప్లాజా పరిసరాల్లో పీఆర్టీఎస్ డిపోలను నిర్మించేందుకు అనువైన స్థలాలను గుర్తించి, సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. డిపో పరిసరాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ ఉండేందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. రూట్స్, డిపోల నిర్మాణం, ఇతర అంశాలపై పూర్తిస్థాయి అధ్యయనం చేసిన తర్వాత ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్ పరిధిలో ఐఐఐటీ జంక్షన్ వద్ద ఫుట్ బ్రిడ్జికి సంబంధించి పలు డిజైన్లను కమిషనర్ ముఖ్యమంత్రికి చూపించగా పరిశీలించిన ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఫుట్‌బ్రిడ్జి సమీపంలో ప్రధానంగా మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. కోహెడలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ అభివృద్ధి పనుల పురోగతి గురించి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. మార్కెట్ అభివృద్ధి పనులతో మెరుగైనా రవాణా సౌకర్యం కోసం సమాంతరంగా రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. క్యూర్ పరిధిలో చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు సంబంధించిన పనుల వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. చెరువుల పునరుద్ధరణలో భాగంగా అవసరమైనచోట ఎస్టీపీల ఏర్పాటు ప్రతిపాదనలను హైడ్రా కమిషనర్ వివరించారు. ఎస్టీపీల నిర్మాణం వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలో మెట్ల బావుల పునరుద్ధరణ విషయంలోనూ అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శేషాద్రి, సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, సీఎంసీ కమిషనర్ శ్రీజన, ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, ఎఫ్‌సిడిఏ కమిషనర్ శశాంక, హెచ్ ఎండబ్ల్యుఎస్ ఎస్‌బీ ఎండీ అశోక్ రెడ్డి, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ నర్సింహా రెడ్డి, హెచ్‌జీసీఎల్ ఎండీ ఉపేందర్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్రీగా రిజిస్ట్రేషన్

ఏడాదిలోపు నిర్మాణాలు పూర్తి : 26 నియోజకవర్గాల్లో టవర్ల నిర్మాణం

హైదరాబాద్, నవంబర్ 24 (సమయం న్యూస్): హైదరాబాద్ మహానగరంలో పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఒక్కో లబ్ధిదారుడికి రూ.50 నుంచి రూ.60 లక్షల విలువైన ఆస్తిని అందించనున్నట్లు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఇళ్లను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అప్పగిస్తామని తెలిపారు. ప్రభుత్వ గృహ నిర్మాణ ప్రాజెక్టు తొలిసారిగా తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీజీ రెరా)లో నమోదు కావడం పారదర్శక పాలనకు నిదర్శనమని మంగళవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో లబ్ధిదారుల ఎంపిక నుంచి ఇళ్ల అప్పగింత వరకు ప్రతి దశలో పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. శంకుస్థాపన జరిగిన ఏడాదిలోపు టవర్ల నిర్మాణం పూర్తి చేసి ఇళ్లను అందజేస్తామని చెప్పారు. రెరాలో నమోదు కావడంతో నిర్మాణాల్లో జాప్యం జరిగినా, నిబంధనలు ఉల్లంఘించినా లబ్ధిదారులు నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదులపై రెరా బిల్డర్లకు నోటీసులు జారీ చేయడంతో పాటు, సరైన వివరణ ఇవ్వకపోతే జరిమానాలు విధించే అవకాశం ఉంటుందని వివరించారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్ల నిర్మాణం చేపట్టగా, ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో పనులు ప్రారంభమయ్యాయి. ఒక్కో నియోజకవర్గంలో నాలుగు టవర్లు, ఒక్కో టవర్‌లో 120 ఫ్లాట్ల చొప్పున మొత్తం 480 ఫ్లాట్లు నిర్మించనున్నారు. ఒక్కో ఫ్లాట్ నిర్మాణ వ్యయం రూ.11 లక్షలు కాగా, ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుంది. మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారులు నాలుగు విడతల్లో చెల్లించాలి. నిధుల వినియోగంలో పారదర్శకత కోసం ప్రతి నియోజకవర్గానికి హౌసింగ్ బోర్డు, బిల్డర్, లబ్ధిదారుల పేర్లతో మూడు ప్రత్యేక ఎస్క్రో బ్యాంకు ఖాతాలు ఏర్పాటు చేశారు. నిర్మాణ పనుల పురోగతిని అనుసరించి బిల్డర్లకు నిధులు విడుదల చేయనున్నారు. ఇందిరమ్మ టవర్స్ ప్రాజెక్టులకు సంబంధించిన రెరా అనుమతి పత్రాలను సోమవారం రెరా చైర్మన్ శ్రీనివాసరాజు నుంచి హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వీపీ గౌతమ్ అందుకున్నారు. ఈ నమోదు వల్ల ప్రాజెక్టులపై లబ్ధిదారులకు మరింత విశ్వాసం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలు

హైదరాబాద్, నవంబర్ 24: తెలంగాణలోని మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ఇందిరమ్మ చీరలను అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తోంది. 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు కోటి చీరలను పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ నెల 26న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. గతంలోనూ మహిళలకు చీరలు పంపిణీ చేసిన ప్రభుత్వం.. తాజాగా రెండో విడతలో భారీ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాలనే తేడా లేకుండా అర్హులైన మహిళలందరికీ చీరలు అందించేలా పంపిణీ ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం కోటి చీరల్లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు 65 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో నివసించే మహిళలకు 35 లక్షలు కేటాయించారు. మహిళల అభిరుచులను దృష్టిలో పెట్టుకుని ఆకర్షణీయమైన చిలుకపచ్చ రంగులో వీటిని రూపొందించారు. చీరల తయారీలో నాణ్యత, మన్నికకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక డిజైన్లను ఎంపిక చేశారు. ఆధునిక అభిరుచులకు సరిపోయేలా రూపొందించడంతో పాటు సంప్రదాయ పద్ధతుల్లోనూ ధరించేందుకు అనువుగా రెండు రకాల చీరలను సిద్ధం చేశారు. పంపిణీ చేయనున్న కోటి చీరల్లో 95 లక్షలు పాలిస్టర్‌తో తయారు చేయగా, ఒక్కోటి 6.30 మీటర్ల పొడవు ఉండనున్నాయి. మిగిలిన ఐదు లక్షల చీరలను పాలీకాటన్ వస్త్రంతో 9 మీటర్ల పొడవులో రూపొందించారు. మహిళలకు నచ్చేలా విభిన్న డిజైన్లతో వీటిని సిద్ధం చేశారు. ఈ చీరల తయారీ బాధ్యతలను రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన నేత కార్మికులకు అప్పగించారు. ప్రభుత్వ కానుకగా మహిళలకు చీరలు అందించడంతోపాటు చేనేత, నేత కార్మికులకు పని కల్పించి వారి ఆర్థిక పరిస్థితికి చేయూతనివ్వాలన్నది ఈ కార్యక్రమం వెనుక ఉన్న మరో ఉద్దేశం. రేషన్‌కార్డు కలిగిన కుటుంబాల్లో 18 ఏళ్లు పూర్తయిన మహిళలందరినీ ఈ పథకానికి అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. అర్హత ఉన్నవారు తమ ఆహార భద్రత కార్డు, ఆధార్ వివరాలను చూపించి చీరలను తీసుకోవచ్చు. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల పర్యవేక్షణలో పంపిణీ ప్రక్రియ కొనసాగనుంది. గ్రామాలు, పట్టణాల్లో వార్డుల వారీగా ప్రజాప్రతినిధుల సమక్షంలో సెర్ప్ సిబ్బంది లబ్ధిదారులకు చీరలను అందజేయనున్నారు. పంపిణీలో పారదర్శకతను పాటించడంతో పాటు అర్హులైన వారికే చీరలు చేరేలా ప్రత్యేక మొబైల్ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇందులో లబ్ధిదారుల వివరాలను నమోదు చేయనున్నారు. ఈ నెల 26న అచ్చంపేటలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభమయ్యే కార్యక్రమం అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు చీరల పంపిణీ చేపట్టనున్నారు.

అసమ్మతి ఎమ్మెల్యేలకు సందీప్ హితవు

- ప్రభుత్వంపై బహిరంగ విమర్శలు చేయొద్దు
- సమస్యలుంటే నేరుగా నా దృష్టికి తీసుకురండి
- రాజగోపాల్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డితో విడివిడిగా సమావేశం
- అభివృద్ధి నిధుల కేటాయింపు, అధికారుల అవినీతిపై ఎమ్మెల్యేల అసంతృప్తి
- రాజగోపాల్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు ఓ వర్గం నేతల ఒత్తిడి
- తాజా పరిణామాలతో కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ



హైదరాబాద్, నవంబర్ 25 (సమయం న్యూస్): సొంత ప్రభుత్వంపై బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు రాష్ట్ర వ్యవహారాల నూతన ఇన్‌చార్జి బీఎం సందీప్ కీలక సూచనలు చేశారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మంగళవారం రాత్రి సందీప్‌తో విడివిడిగా సమావేశమయ్యారు. ఇటీవల తాము చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వివరణ ఇచ్చినట్లు సమాచారం. ప్రభుత్వ పనితీరుపై అభ్యంతరాలుంటే బహిరంగంగా విమర్శలు చేయకుండా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సందీప్ సూచించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని పరిస్థితులను సమగ్రంగా అధ్యయనం చేసి, పార్టీ నాయకులతో చర్చించిన అనంతరం సమస్యలపై స్పందిస్తానని స్పష్టం చేసినట్లు సమాచారం. ఎమ్మెల్యేలతో భేటీకి ముందే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవితో సందీప్ చర్చలు జరిపారు. రాజగోపాల్‌రెడ్డి హద్దులు దాటి వ్యవహరించారని, ఆయన విషయంలో ఏఐసీసీ నిర్ణయం తీసుకుంటుందని మల్లు రవి ఇప్పటికే పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపై పదేపదే విమర్శలు చేస్తున్న రాజగోపాల్‌రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పార్టీలోని ఓ వర్గం నాయకులు అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అభివృద్ధి నిధుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని ఆరోపిస్తూ ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై రాజగోపాల్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. మరోవైపు కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులకు కొందరు అధికారులు భారీగా కమీషన్లు డిమాండ్ చేస్తున్నారని అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. అధికారుల అవినీతి కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింటోందని విమర్శించారు. ఈ నెల 19న సిద్దిపేటలో జరిగిన బహిరంగ సభలో అసమ్మతి ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వారికి పిచ్చికుక్కలు కరిచాయని, పార్టీ శ్రేణులే మానసిక వైద్యశాలకు తీసుకెళ్తారని వ్యాఖ్యానించారు. దీనిపై మరుసటి రోజు సామాజిక మాధ్యమాల వేదికగా రాజగోపాల్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. ఉన్నత పదవుల్లో ఉన్నవారు హుందాగా మాట్లాడాలని, అధికార మదంతో ఇష్టానుసారం వ్యవహరిస్తే ప్రజలు హర్షించరని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి కక్షపూరిత పాలన సాగించేవారిని ప్రజలు, చరిత్ర క్షమించబోవని విమర్శించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అసమ్మతి ఎమ్మెల్యేలతో సందీప్ నిర్వహించిన సమావేశాలకు రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. ఎమ్మెల్యేలు లేవనెత్తిన సమస్యలకు పరిష్కారం చూపడంతోపాటు బహిరంగ విమర్శలకు అడ్డుకట్ట వేసేందుకు అధిష్ఠానం ఎలాంటి చర్యలు చేపడుతుందన్నది కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

ప్రపంచ వేదికపై తెలంగాణ సత్తా చాటేలా గ్లోబల్ సమ్మిట్

- డిసెంబర్ 7 నుంచి 9 వరకు ప్రపంచ పెట్టుబడుల సదస్సు
- 1,500 మందికిపైగా సీఈవోలు, పెట్టుబడిదారుల రాక
- భారత్ ఫ్యూచర్ సిటీలో పనులను పరిశీలించిన మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 25 (సమయం న్యూస్): అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ బ్రాండ్ ప్రతిష్ఠను మరింత పెంచేలా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'ను నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. బుధవారం హైదరాబాద్ శివారులోని భారత్ ఫ్యూచర్ సిటీలో సదస్సు ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వేదిక నిర్మాణం, ప్రదర్శన ప్రాంగణాలు, భద్రతా ఏర్పాట్లు, రవాణా నిర్వహణ, అతిథుల వసతి తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలవనుందని మంత్రి పేర్కొన్నారు. ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఈ సదస్సు జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా 1,500 మందికిపైగా సీఈవోలు, పెట్టుబడిదారులు, దౌత్యవేత్తలు హాజరుకానున్నారు. రక్షణ, ఔషధ తయారీ, గేమింగ్, కృత్రిమ మేధ తదితర కీలక రంగాలకు చెందిన వెయ్యికిపైగా సంస్థల భాగస్వామ్యంతో బహుళ రంగాల ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధుల భద్రత కోసం ముఖ గుర్తింపు వ్యవస్థ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు తెలంగాణలోని పారిశ్రామిక అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనుంది.



నీళ్ల విషయంలో రేవంత్ పచ్చి అబద్ధాలు

- కేసీఆర్ పోరాటంతోనే తెలంగాణకు సాగునీటి హక్కులు
- పాలమూరులో 10 లక్షల ఎకరాలకు బీఆర్ఎస్ నీళ్లిచ్చింది
- ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం
- కృష్ణా జలాల వాటాపై తాత్కాలిక ఒప్పందమే
- రేవంత్ వ్యాఖ్యలకు ఆధారాలతో సమాధానం చెబుతాం
- బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్ 24 (సమయం న్యూస్): తెలంగాణ సాగునీటి హక్కులు, ప్రాజెక్టులు, కృష్ణా జలాల వాటా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాటాన్ని తప్పుబట్టడం దారుణమన్నారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన సాగునీటి ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసి లక్షల ఎకరాలకు నీరందించిందని చెప్పారు. ఉమ్మడి పాలనలో పాలమూరుకు కేవలం 30 వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందితే, కేసీఆర్ ప్రభుత్వం కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ తదితర పథకాల ద్వారా 10 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చిందన్నారు. పాలమూరు ప్రాజెక్టులపై రూ.30 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో 75 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. కుప్పంకు నీళ్లు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నా పాలమూరు రైతులకు సాగునీరు అందకపోవడంపై ప్రశ్నించారు.



కాళేశ్వరం, ఎల్లంపల్లి, అన్నారం, సుందిళ్ల, సమ్మక్క సాగర్, సీతమ్మ సాగర్ వంటి ప్రాజెక్టుల నిర్మాణం, పెండింగ్ పనుల పూర్తి బీఆర్ఎస్ హయాంలోనే జరిగిందన్నారు. మిషన్ కాకతీయ, చెక్‌డ్యాంలు, కొత్త ప్రాజెక్టుల నిర్మాణంతోనే 2021-22లో తెలంగాణ వరి ఉత్పత్తిలో దేశంలో అగ్రస్థానానికి చేరిందని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం మూడేళ్లలో ఎన్ని ఎకరాలకు సాగునీరు అందించిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఒక్క టీఎంసీ సామర్థ్యం ఉన్న కొత్త రిజర్వాయర్ కూడా నిర్మించలేదని విమర్శించారు. పల్నాడు వాటర్ గ్రిడ్, బనకచర్ల ప్రాజెక్టుల విషయంలోనూ రేవంత్ తప్పుడు వివరాలు చెబుతున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఏపీ ప్రాజెక్టులపై బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలోనే అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ లేఖలు రాసిందని గుర్తుచేశారు. పల్నాడు ప్రాజెక్టుకు 2025 జనవరిలో టెండర్లు పిలిచినా తెలంగాణ ప్రభుత్వం స్పందించలేదని, విషయం వెలుగులోకి వచ్చిన తర్వాతే లేఖలు రాసిందని విమర్శించారు. నాగార్జునసాగర్ నుంచి 1.865 టీఎంసీల నీటిని తీసుకునే అంశం కొత్త జీవోలో ఉందని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. కృష్ణా జలాల 299:512 టీఎంసీల వాటా విషయంలోనూ కాంగ్రెస్ నాయకులే గతంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. 2015 ఒప్పందం శాశ్వతమైనది కాదని, ట్రిబ్యునల్ తీర్పు వచ్చే వరకు తాత్కాలికంగా అమలయ్యే ఏర్పాటేనని స్పష్టం చేశారు. తెలంగాణకు న్యాయమైన వాటా కోసం కేసీఆర్ కేంద్రాన్ని పలుమార్లు కోరారని, ట్రిబ్యునల్ ఏర్పాటు కోసం పోరాడారని తెలిపారు. 50:50 నిష్పత్తిలో నీటి వినియోగం కొనసాగించాలని 30కి పైగా లేఖలు రాసినట్లు పేర్కొన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకునేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం 19 లేఖలు రాసిందని, కేఆర్ఎంబీ, అపెక్స్ కౌన్సిల్ సమావేశాల్లోనూ వ్యతిరేకించిందని తెలిపారు. 2020 జనవరి నుంచే ఈ ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేశామని, కేసీఆర్ కేంద్ర జలశక్తి మంత్రికి కూడా లేఖ రాశారని చెప్పారు. రేవంత్‌రెడ్డి మాత్రం కేసీఆర్ ఈ ప్రాజెక్టుకు అంగీకరించారని చెప్పడం పూర్తిగా అవాస్తవమన్నారు. పోతిరెడ్డిపాడు విస్తరణపై కూడా బీఆర్ఎస్ గతంలో అసెంబ్లీలో పోరాటం చేసిందని గుర్తుచేశారు. నీటి వినియోగ గణాంకాలను కూడా రేవంత్‌రెడ్డి తనకు అనుకూలంగా వక్రీకరిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు.

2024-25లో ఏపీ 718 టీఎంసీలు, తెలంగాణ 286 టీఎంసీలు వినియోగించగా, 2025-26లో ఏపీ 771 టీఎంసీలు, తెలంగాణ 267 టీఎంసీలు మాత్రమే వాడుకున్నాయని తెలిపారు. తెలంగాణ నీటి వినియోగం చరిత్రలోనే అత్యల్ప స్థాయికి పడిపోయిందని ఆరోపించారు. దేవాదుల, సీతారామ, కల్వకుర్తి తదితర ఎత్తిపోతల పథకాలను ఎన్ని రోజులు నడిపించారో ప్రభుత్వం వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు సాగునీరు, తాగునీరు అందించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కీలక పాత్ర పోషించిందని, మిషన్ భగీరథ దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. ప్రాజెక్టుల అనుమతులు సాధించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నీటి అంశాలపై అసెంబ్లీలో వారం, పది రోజుల పాటు చర్చకు సిద్ధంగా ఉన్నామని, రేవంత్‌రెడ్డి కూడా సిద్ధం కావాలని సవాల్ విసిరారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. సమావేశంలో మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.



డ్రగ్స్ రహిత భారత్ కోసం ప్రజా ఉద్యమం

- నేటి నుంచి 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర
- అంబర్‌పేట నుంచి ఫిల్మ్‌నగర్ వరకు కార్యక్రమం
- 2029 చివరి నాటికి డ్రగ్స్ నియంత్రణ లక్ష్యం
- యువతను క్రీడల వైపు మళ్లించాలి: కిషన్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 24: దేశంలో మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుతో పాటు దేశ అభివృద్ధికి ముప్పుగా మారుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు నవంబర్ 25 నుంచి మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నగరంలో మీడియాతో మాట్లాడుతూ.. పంజాబ్‌తో పాటు ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోనూ మాదకద్రవ్యాల సమస్య విస్తరిస్తోందని తెలిపారు. డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చే డబ్బును దేశ వ్యతిరేక కార్యకలాపాలు, ఉగ్రవాదానికి వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో డ్రగ్స్ నియంత్రణకు పోలీసులు, ముఖ్యంగా ఈగల్ బృందాలు చేస్తున్న కృషిని ప్రశంసించారు. వాటి కార్యకలాపాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. 2029 చివరి నాటికి మాదకద్రవ్యాల సమస్యను పూర్తిస్థాయిలో నియంత్రించాలనే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విదేశాల నుంచి డ్రగ్స్ అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఇతర దేశాలతో ఒప్పందాలు చేసుకుంటున్నామని, నిఘా సంస్థలు కూడా అంతర్జాతీయ స్థాయిలో చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. యువతను వ్యసనాలకు దూరంగా ఉంచేందుకు క్రీడలను ప్రోత్సహించాలని కిషన్‌రెడ్డి సూచించారు. తెలంగాణలో మరిన్ని క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. నవంబర్ 25న అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి ప్రారంభమయ్యే పాదయాత్ర 27వ తేదీ సాయంత్రం ఫిల్మ్‌నగర్‌లో ముగుస్తుందని తెలిపారు. ఇది రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న తొలి విడత కార్యక్రమమని, ఇందులో పాల్గొనాలని పోలీస్ కమిషనర్‌తో పాటు ఉన్నతాధికారులను ఆహ్వానించినట్లు చెప్పారు.

సహాయకుడి అకాల మరణంతో కేసీఆర్ దిగ్భ్రాంతి

- రోడ్డు ప్రమాదంలో వ్యక్తిగత సహాయకుడు మహేందర్ రెడ్డి దుర్మరణం
- అంత్యక్రియలకు హాజరై పాడె మోసిన మాజీ ఎంపీ సంతోష్ కుమార్

హైదరాబాద్, నవంబర్ 25 (సమయం న్యూస్): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన వ్యక్తిగత సహాయకుడు మహేందర్ రెడ్డి మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహేందర్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం తెలిసిందే. అతడి మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ, వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు. మహేందర్ రెడ్డి మరణవార్త తెలియగానే కేసీఆర్ తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. వెంటనే అంత్యక్రియల ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలని మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్‌ను ఆదేశించారు. అధినేత ఆదేశాల మేరకు సంతోష్ కుమార్, ఇతర పార్టీ నేతలు, కేసీఆర్ వ్యక్తిగత సిబ్బందితో కలిసి మహేందర్ రెడ్డి స్వగ్రామమైన బందనకల్‌కు చేరుకున్నారు. అక్కడ మహేందర్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో సంతోష్ కుమార్ స్వయంగా పాడె మోశారు. మహేందర్ రెడ్డితో తనకున్న వ్యక్తిగత అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. శోకసంద్రంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులను ఆయన ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ, మహేందర్ రెడ్డి కుటుంబాన్ని కేసీఆర్ అన్ని విధాలుగా ఆదుకుంటారని స్పష్టం చేశారు. మహేందర్ రెడ్డికి తండ్రి, చెల్లెలు, నాయనమ్మ ఉన్నారని, వారి బాధ్యతను పార్టీ తీసుకుంటుందని తెలిపారు. మహేందర్ రెడ్డి సోదరి చదువుతో పాటు ఆమె వివాహ బాధ్యతలను స్వయంగా కేసీఆరే చూసుకుంటారని వెల్లడించారు. అలాగే తండ్రి, నాయనమ్మల ఆరోగ్య బాగోగులను కూడా కేసీఆర్ స్వయంగా పర్యవేక్షిస్తారని ఆయన కుటుంబానికి హామీ ఇచ్చారు. ఈ అంత్యక్రియల కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు, నేతలు అంజిరెడ్డి, జుబేర్, కేసీఆర్ వ్యక్తిగత కార్యదర్శి (పీఎస్) నాగేందర్ రెడ్డితో పాటు పలువురు కార్యాలయ సిబ్బంది, స్థానిక పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





ఎన్నికల వేళ కొత్త పొత్తులు.. సీట్ల సర్దుబాట్లు!

- ఆరేళ్ల తర్వాత మళ్లీ ఎన్డీయే గూటికి అకాలీదళ్
- పంజాబ్ ఎన్నికల్లో బీజేపీ, అకాలీదళ్ కలిసి పోటీ



న్యూఢిల్లీ, నవంబర్ 24 (సమయం న్యూస్): వచ్చే ఏడాది జరగనున్న పంజాబ్, ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల మధ్య పొత్తులు, సీట్ల సర్దుబాటు చర్చలు ఊపందుకున్నాయి. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత శిరోమణి అకాలీదళ్ తిరిగి ఎన్డీయే కూటమిలో చేరింది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, అకాలీదళ్ కలిసి పోటీ చేయనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రకటించారు. పంజాబ్‌ను మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం, అవినీతి నిర్మూలన, రైతుల సమస్యల పరిష్కారం, జాతీయవాద శక్తులను బలోపేతం చేయడం తమ కూటమి ప్రధాన లక్ష్యాలని వెల్లడించారు. మరోవైపు ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల మధ్య తొలి విడత సీట్ల సర్దుబాటు చర్చలు జరిగాయి. కాంగ్రెస్‌కు 26 అసెంబ్లీ స్థానాలను ప్రతిపాదించినట్లు సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ వెల్లడించారు. కాంగ్రెస్ మాత్రం వందకుపైగా స్థానాలను కోరుతున్నట్లు సమాచారం. దీంతో ఇరు పార్టీల మధ్య సీట్ల పంపకాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఉత్తర్‌ప్రదేశ్‌లో మొత్తం 403 అసెంబ్లీ స్థానాలు ఉండగా, 2022 ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ 347 స్థానాల్లో పోటీ చేసి 111 చోట్ల విజయం సాధించింది. కాంగ్రెస్ 399 స్థానాల్లో బరిలోకి దిగి రెండు సీట్లకే పరిమితమైంది. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమిలో భాగంగా కలిసి పోటీ చేసిన రెండు పార్టీలు మెరుగైన ఫలితాలను సాధించాయి. అదే ఒరవడిని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ కొనసాగించేందుకు ఇరు పార్టీలు సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుపుతున్నాయి.

యూఏఈలో ఘోర రోడ్డు ప్రమాదం.. | 13 మంది దుర్మరణం!

- రాస్ అల్ ఖైమాలో బస్సు, ట్రక్కు ఢీ
- మృతుల్లో భారతీయులు.. 14 మందికి గాయాలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మృతి
- బాధిత కుటుంబాలకు భారత కాన్సులేట్ అండ
- సహాయం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు



రాస్ అల్ ఖైమా, నవంబర్ 24 (సమయం న్యూస్): యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రాస్ అల్ ఖైమాలోని అల్ వతన్ రహదారిపై ప్రయాణికుల బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో 13 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది గాయపడ్డారు. మృతుల్లో భారతీయులు కూడా ఉన్నట్లు దుబాయ్‌లోని భారత కాన్సులేట్ వెల్లడించింది. అయితే ఎంతమంది భారతీయులు మరణించారనే వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. యూఏఈ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం.. 41 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు సాంకేతిక లోపంతో రహదారి పక్కన నిలిపి ఉన్న ట్రక్కును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తొలుత 11 మంది మరణించగా, తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 13కు చేరింది. ప్రమాదంలో భారతీయులు ప్రాణాలు కోల్పోవడంపై దుబాయ్‌లోని భారత కాన్సులేట్ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. సహాయం కోసం 24 గంటలూ అందుబాటులో ఉండే టోల్‌ఫ్రీ నంబర్ 800-46342ను ప్రకటించింది. కాగా, ఈ నెల 13న యూఏఈలోని ఫుజైరాలో జరిగిన మరో ఘోర రోడ్డు ప్రమాదంలో 23 వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆ ఘటనలో నలుగురు భారతీయులు సహా 14 మంది మరణించగా, ఏడుగురు భారతీయులు సహా 30 మంది గాయపడ్డారు. పక్షం రోజుల వ్యవధిలోనే మరో ఘోర ప్రమాదం చోటుచేసుకోవడం తీవ్ర విషాదాన్ని నింపింది.

లక్నోలో ఘనంగా ముగిసిన తహ్బీబ్ ఫెస్టివల్

ప్రత్యేక ఆకర్షణగా అంతర్జాతీయ ముషాయిరా



లక్నో, నవంబర్ 24 (సమయం న్యూస్): సాహిత్యం, సంగీతం, కళలు, సంస్కృతుల సమ్మేళనంగా లక్నోలోని ఇంటిగ్రల్ యూనివర్సిటీలో మూడు రోజులపాటు నిర్వహించిన 'తహ్బీబ్ ఫెస్టివల్--2026' ఘనంగా ముగిసింది. తహ్బీబ్ గ్లోబల్ కన్వీనర్ తారిఖ్ ఫైజీ సమన్వయంతో నిర్వహించిన ఈ ఉత్సవాల్లో సుమారు 25 వేల నుంచి 30 వేల మంది పాల్గొన్నారు. అంతర్జాతీయ ముషాయిరా వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ గజల్ గాయకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ హరియోమ్ తన గజల్స్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఆయన ప్రదర్శనకు ముఖ్యంగా విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. దుబాయ్‌కు చెందిన ఎమిరాతీ కవి మహమ్మద్ అల్ హెబ్సీ తన అరబిక్ కవిత్వంతో సాహిత్యాభిమానులను అలరించారు. ఆయన కవితలకు హిందీ అనువాదాన్ని అందించడం ద్వారా భాషలకు అతీతంగా సాహిత్యాన్ని ప్రేక్షకులకు చేరువ చేశారు. ఆయన భాగస్వామ్యం భారత్--యూఏఈ సాంస్కృతిక, సాహిత్య సంబంధాలకు ప్రతీకగా నిలిచింది. దుబాయ్‌కు చెందిన దీబా ఇర్ఫాన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు, హస్తకళలు, వస్త్రాలంకరణ, జీవనశైలి, సృజనాత్మక ఉత్పత్తుల విక్రయశాలలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. యువత, విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం ఉత్సవాలకు మరింత శోభను తీసుకొచ్చింది. 'ప్రజలు-సంస్కృతులు-ఆలోచనలు' అనే నినాదంతో తహ్బీబ్ గ్లోబల్ సాహిత్యం, సంగీతం, కళలు, కవిత్వం ద్వారా అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహిస్తోంది. ఇంటిగ్రల్ యూనివర్సిటీ సహకారంతో నిర్వహించిన ఈ ఉత్సవం లక్నో చారిత్రక గంగా-జమునీ మిశ్రమ సంస్కృతిని అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పింది.

కలెక్టర్‌కే వేధింపులు

సర్కారుపై హైకోర్టు ఆగ్రహం!

- మహిళా కలెక్టర్‌కు అసభ్య సందేశాలు పంపినట్లు ఆరోపణలు
- టీవీకే ఎమ్మెల్యే అరుల్ విఘ్నేష్‌పై ఎఫ్ఐఆర్
- రంగంలోకి దిగిన జాతీయ మహిళా కమిషన్



చెన్నై, నవంబర్ 24 (సమయం న్యూస్): తమిళనాడులో మహిళా కలెక్టర్‌కు అసభ్యకర సందేశాలు పంపినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికార టీవీకే ఎమ్మెల్యే సి. అరుల్ విఘ్నేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. కల్లకురిచ్చి జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తమిళనాడు మహిళలపై వేధింపుల నిరోధక చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు మద్రాస్ హైకోర్టుకు వెల్లడించారు. అయితే ఈ వ్యవహారంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జులై 31నే ప్రభుత్వానికి సమాచారం అందినప్పటికీ ఇంతకాలం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించింది. ఎమ్మెల్యేపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని కోరుతూ అన్నాడీఎంకే న్యాయవాది ఆర్. తిరుసూలి మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం జస్టిస్ లక్ష్మీనారాయణన్ ఎదుట ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. కలెక్టర్ నుంచి ఫిర్యాదు అందిందా అని న్యాయమూర్తి ప్రశ్నించగా, అప్పటివరకు పోలీసులకు గానీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి గానీ ఫిర్యాదు అందలేదని ప్రభుత్వ ప్రధాన క్రిమినల్ న్యాయవాది ఆర్. జాన్ సత్యన్ తెలిపారు. దీంతో కలెక్టర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సంప్రదించి వివరాలు సేకరించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఈ నేపథ్యంలో సోమవారం కల్లకురిచ్చి జిల్లా ఎస్పీకి కలెక్టర్ ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎమ్మెల్యే తనతో అనుచితంగా ప్రవర్తించడంతోపాటు అవాంఛిత సందేశాలు పంపారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. మంగళవారం కేసు మరోసారి విచారణకు రాగా, ఎమ్మెల్యేపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు ప్రభుత్వ న్యాయవాది లిఖితపూర్వక వివరణ సమర్పించారు. అయితే ప్రభుత్వ వివరణపై న్యాయస్థానం సంతృప్తి వ్యక్తం చేయలేదు. జులై 31నే ఈ వ్యవహారం ప్రభుత్వ దృష్టికి వచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని జస్టిస్ లక్ష్మీనారాయణన్ నిలదీశారు. ఎవరినైనా కాపాడేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు చిన్న అనుమానం వచ్చినా సహించేది లేదని హెచ్చరించారు. ఆరోపణలపై విచారణ జరిపేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ స్పందనను నిశితంగా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు మహిళా కలెక్టర్‌కు ఎమ్మెల్యే అనుచిత సందేశాలు పంపినట్లు వెలువడిన కథనాలపై జాతీయ మహిళా కమిషన్ స్పందించింది. ఆరోపణలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఎమ్మెల్యేపై కేసు నమోదు, ప్రభుత్వ తీరుపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలతో ఈ వ్యవహారం తమిళనాడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ప్రధాని మోదీకి జర్మనీ ఛాన్సలర్ మెర్జ్ ఫోన్..

ద్వైపాక్షిక సంబంధాలపై చర్చ..



న్యూఢిల్లీ, నవంబర్ 24: ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ మంగళవారం ఫోన్ చేశారు. ఈ సందర్భంగా భారత్-జర్మనీ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం, భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై ఇరుదేశాల నేతలు చర్చించారు. రక్షణ, అధునాతన సాంకేతిక రంగాల్లో పరస్పర సహకారంపై మంతనాలు జరిపారు. ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలు, ప్రపంచ శాంతి, స్థిరత్వానికి సంబంధించిన అంశాలపైనా అభిప్రాయాలు పంచుకున్నారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రధానమంత్రి కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం.. భారత్-జర్మనీ వ్యూహాత్మక భాగస్వామ్యంలో సాధించిన పురోగతిపై మోదీ, మెర్జ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాదితో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపథ్యంలో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించాలని ఇద్దరు నేతలు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా రక్షణ రంగం, అధునాతన సాంకేతిక పరిజ్ఞానం వంటి కీలక రంగాల్లో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కూడా చర్చకు వచ్చింది. ఈ ఒప్పందం అమల్లోకి వస్తే ఇరుదేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని మోదీ, మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపైనా మోదీ, మెర్జ్ చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, స్థిరత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. అలాగే, ప్రస్తుత ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు బహుళపక్ష అంతర్జాతీయ వేదికలపై పరస్పర సహకారాన్ని కొనసాగించడం అవసరమని స్పష్టం చేశారు. తాజా ఫోన్ సంభాషణతో భారత్-జర్మనీ సంబంధాలను రక్షణ, సాంకేతికత, వాణిజ్యం, పెట్టుబడుల రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్లాలన్న ఇరుదేశాల నిబద్ధత మరోసారి వెల్లడైంది. కాగా, సెప్టెంబర్ 10న కూడా ప్రధాని మోదీ, మెర్జ్ మధ్య ఫోన్ సంభాషణ జరిగింది.

మా షరతులకు ఒప్పుకుంటేనే చర్చలు!

అమెరికాకు ఇరాన్ స్పష్టీకరణ

యుద్ధానికి ముగింపు పలికేందుకు ఏడు షరతులు

టెహ్రాన్, నవంబర్ 24 (సమయం న్యూస్): యుద్ధానికి ముగింపు పలికే విషయంలో తాము ప్రతిపాదించిన ఏడు షరతులకు అంగీకరించే వరకు అమెరికాతో చర్చలు జరిపేది లేదని ఇరాన్ స్పష్టం చేసింది. మంగళవారం ప్రభుత్వ ప్రసార మాధ్యమానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ గాలిబఫ్ ఈ మేరకు వెల్లడించారు. తమ షరతులకు అమెరికా అంగీకరిస్తేనే చర్చలు ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిలో అమెరికా సైనిక రక్షణలో ప్రయాణిస్తున్న మూడు చమురు ట్యాంకర్లను సముద్ర మందుపాతరలతో ముంచివేసినట్లు ఇరాన్ పేర్కొంది. అమెరికా తన వైఖరిని మార్చుకోకపోతే ఇటువంటి ఘటనలు పునరావృత మవుతాయని హెచ్చరించింది. అయితే ట్యాంకర్లపై దాడులకు సంబంధించిన ఇరాన్ ప్రకటనకు స్వతంత్ర నిర్ధారణ లేదు. చర్చలకు సంబంధించి ఇరాన్ విధించిన ఏడు షరతుల పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడి కాలేదు. అయితే ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలను ఎత్తివేయడం, ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధాన్ని తొలగించడం, స్వాధీనం చేసుకున్న ఇరాన్ ఆస్తులను తిరిగి అప్పగించడం వంటి అంశాలు ఆ జాబితాలో ఉన్నట్లు ఇరాన్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. అమెరికా మొండివైఖరితో ముందుకెళ్తే తాము ప్రస్తుత పరిమితులను దాటి దాడులకు దిగుతామని ఇరాన్ హెచ్చరించింది.



భారత్ నుంచి స్వదేశానికి హసీనా

- సంకెళ్లతో తీసుకొస్తామన్న బంగ్లాదేశ్ మంత్రి!
- డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు వెళ్తున్న షేక్ హసీనా..
- హైవేల బిగ్బంధానికి పిలుపునిచ్చిన అవామీ లీగ్..
- సంకెళ్లతో తీసుకొస్తామన్న బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి



ఢాకా, నవంబర్ 24 (సమయం న్యూస్): బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా డిసెంబర్ 16న స్వదేశానికి తిరిగి వెళ్తున్నారు. రెండేళ్లుగా భారత్‌లో నివసిస్తున్న ఆమె బంగ్లాదేశ్ వెళ్తున్నట్లు ఆమె అధికార ప్రతినిధి మంగళవారం ప్రకటించారు. హసీనా వస్తుండటంతో ఆమె పార్టీ అవామీలీగ్ సంబరాలు చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో 16న బంగ్లా జాతీయ రహదారుల్ని ఆక్రమిస్తామని ప్రకటించింది. ఆమెను ప్రజానాయకురాలిగా అభివర్ణిస్తూ అవామీలీగ్ ఫేస్‌బుక్‌లో కీలక ప్రకటన చేసింది. డిసెంబర్ 16నే బంగ్లాదేవ్ 1971 విమోచనయుద్ధ విజయ వార్షికోత్సవం, ఆ రోజునే స్వదేశానికి వెళ్లేందుకు షేక్ హసీనా ఎంచుకున్నారు . హసీనా బంగ్లా వస్తుండటంతో ఇప్పటికే ఆ దేశంలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఇది రాజకీయ, న్యాయపరమైన ఉద్రిక్తతలకు కారణమయ్యే అవకాశం ఉంది. షేక్ హసీనా తన పత్రాలను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేయడమే కాకుండా, ప్రభుత్వ యాజమాన్యంలోని విమాన సంస్థ బిమాన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్ ద్వారా తిరిగి రావడానికి ఏర్పాట్లు చేయాలని బంగ్లాద్ ప్రభుత్వాన్ని కోరారు. మరోవైపు, షేక్ హసీనా రాకపై అధికార బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్పీ), ఆ పార్టీ నేతలు తీవ్రంగా స్పందిస్తున్నారు. బంగ్లాదేశ్ విదేశాంగ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ మాట్లాడుతూ.. షేక్ హసీనా చేతులకు సంకెళ్లు వేసి, కట్టుదిట్టమైన భద్రత నడుమ బంగ్లాదేశ్ తీసుకువస్తామని అన్నారు. 2024లో హింసాత్మక ఉద్యమం తర్వాత షేక్ హసీనా తన ప్రధాని పదవికి రాజీనామా చేసి భారత్ వచ్చారు. ఈ హింసలో 1400 మంది మరణించారు. గతేడాది నవంబర్‌లో బంగ్లాదేశ్ యుద్ధ నేరాల న్యాయస్థానం హసీనాకు మరణశిక్ష విధించింది. ఆమె మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడినట్లు ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణల్ని హసీనా ఖండించారు.

నీటి అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు హరీశ్‌రావు కౌంటర్

- హరీశ్‌రావు మీడియా సమావేశం – ప్రెస్‌నోట్
- పత్రికా ప్రకటన
- నీటి అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు హరీశ్‌రావు కౌంటర్



హైదరాబాద్, నవంబర్ 24:

తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలోని సాగు, తాగునీటి అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అనేక పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి లక్షల ఎకరాలకు సాగునీరు అందించామని హరీశ్‌రావు పేర్కొన్నారు. పాలమూరు-రంగారెడ్డి, ఎస్ఆర్ఎస్పీ, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ తదితర ప్రాజెక్టుల ద్వారా నీటిని అందించామని తెలిపారు.ప్రస్తుత ప్రభుత్వం పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. కొత్త ఆయకట్టు, కొత్త ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం సాధించిన పురోగతిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కృష్ణా జలాల 299:512 వాటా విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్లక్ష్యమే ప్రస్తుత పరిస్థితికి కారణమని హరీశ్‌రావు ఆరోపించారు. 299:512 వాటా శాశ్వత ఒప్పందం కాదని, తెలంగాణకు న్యాయమైన నీటి వాటా కోసం కేసీఆర్ ప్రభుత్వం ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిందని పేర్కొన్నారు.పల్నాడు వాటర్ గ్రిడ్, రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టులపై కూడా ఆయన స్పందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆయా ప్రాజెక్టులను వ్యతిరేకిస్తూ కేంద్రానికి, కేఆర్ఎంబీకి పలు లేఖలు రాసిందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఈ అంశాలపై సరైన సమయంలో స్పందించలేదని ఆరోపించారు.నీటి వినియోగంలో తెలంగాణ వెనుకబడిందని, ప్రభుత్వం అందుబాటులో ఉన్న నీటిని కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతోందని హరీశ్‌రావు విమర్శించారు. దేవాదుల, సీతారామ, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులను ప్రస్తుత ప్రభుత్వం ఎన్ని రోజులు, ఎన్ని గంటలు నడిపిందో వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు" అని హరీశ్‌రావు విమర్శించారు. నీటి అంశాలపై అసెంబ్లీలో విస్తృత చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, మైకులు కట్ చేయకుండా చర్చకు అవకాశం ఇవ్వాలని సవాల్ చేశారు.కేసీఆర్ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు, తెలంగాణకు సంబంధించిన నీటి హక్కులపై బీఆర్ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందని హరీశ్‌రావు తెలిపారు.ఈ మీడియా సమావేశంలో మండలి ఎల్ఓపీ మధుసూదనాచారి, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు దేవి ప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి...

- వడ్డేపల్లి సర్పంచ్ రేణుక రాజా గౌడ్..

రాయపోల్ నవంబర్ 24. (సమయం న్యూస్)

ఇందిరమ్మ బీమా పథకాన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామ సర్పంచ్ రాజా గారి రేణుక రాజా గౌడ్ అన్నారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని తెల్ల రేషన్ కార్డు కలిగివున్న ప్రతి ఒక్కరు అర్హులని పేర్కొన్నారు. ఈ పథకంపై గ్రామంలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఎంతో ఉందన్నారు. ప్రతి ఇంటికి ఇందిరమ్మ బీమా పథకం రావాలని. ఇందుకు అవసరమైన పత్రాలను సంబంధిత అధికారులకు అందజేయాలని పేర్కొన్నారు. బీమా పథకం ఉంటే కుటుంబాలకు ఎంతో అండగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు గ్రామంలో అర్హులైన పేదలకు అందే విధంగా తాము నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. అర్హులందరికీ పథకాలు అందాలని. రానివారికి అందించే విధంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఇందిరమ్మ జీవిత బీమా పథకం పేదలకు ఎంతో వరంగా ఉంటుందని ఈ మంచి పథకాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వార్డు సభ్యులు కరుణాకర్. నాగరాజు. పంచాయతీ సెక్రెటరీ లావణ్య మరియు అంగన్వాడి టీచర్లు ఆశా వర్కర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



రాబోవు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో

కాంగ్రెస్ అభ్యర్థులకు పెన్షనర్ల మద్దతు

కొడంగల్ మున్సిపల్, నవంబర్,24(సమయం న్యూస్)

రాబోవు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాష్ట్రంలోని పెన్షనర్లంతా కాంగ్రెస్ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు తెలపనున్నారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పేరి వెంకట్ రెడ్డి ప్రకటించారు.మంగళవారం కొడంగల్‌లో పర్యటించిన ఆయన స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘంతో సమావేశమై ఉద్యోగుల సంక్షేమం, పెన్షన్లు మరియు ఆరోగ్య పథకాలకు సంబంధించిన పలు కీలక విషయాలను వెల్లడించారు: పీఆర్సీ ప్రకటన మరియు ఎన్నికల మద్దతు: ఇటీవల తాము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందే ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటించాలని విన్నవించగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల మంది పెన్షనర్లు ఉండగా, అందులో హైదరాబాద్‌లోనే 90 వేల మంది ఉన్నారని, వారంతా రాబోవు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేయనున్నారని గుర్తు చేశారు.హెల్త్ కార్డులు,ఆసుపత్రుల తీరు: రాష్ట్ర ప్రభుత్వం నూతన హెల్త్ కార్డులను ప్రవేశ పెట్టి పెన్షనర్లకు అండగా నిలిచిందని కొనియాడారు. అయితే, హైదరాబాద్‌లో ఒక పార్టీకి అనుకూలమైన కొన్ని ఆసుపత్రుల వారు ఈ పథకాన్ని బద్నాం చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి,ఉపముఖ్యమంత్రి దృష్టికి కూలంకషంగా తీసుకెళ్లామని,ఆ ఆసుపత్రులపై త్వరలోనే కఠిన చర్యలు ఉంటాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.రిటైర్మెంట్ బకాయిల విడుదల: ఉద్యోగ విరమణ పొందిన చాలా మందికి రావాల్సిన డబ్బుల విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా ₹6 వేల కోట్లు విడుదల చేయించామని తెలిపారు. మరో ₹8 వేల కోట్లు విడుదల చేస్తే దాదాపు అందరికీ పెన్షన్ బెనిఫిట్లు అందుతాయని పేర్కొన్నారు పాత పెన్షన్ విధానం (OPS): డీఏస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ రాబోతోందని తెలిపారు. ఆ తర్వాత ఉద్యోగం పొందిన వారందరికీ సీపీఎస్ (CPS) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఉస్మాన్ పాషా మాట్లాడుతూ, నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకానికి సంబంధించి ఏ సమస్య ఉన్నా వెంటనే సంబంధిత జిల్లా మేనేజర్లను సంప్రదించాలని సూచిస్తూ వారి ఫోన్ నంబర్లను విడుదల చేశారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో స్థానిక ట్రెజరీ అధికారులు పెన్షనర్లను ఇబ్బంది పెడుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని, అధికారుల పనితీరు మారకుంటే ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ పర్యటనలో వారు మండల విద్యాధికారి రాంరెడ్డితో కూడా సమావేశమై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ కొడంగల్ అధ్యక్షులు రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి జిల్లా ఉపాధ్యక్షులు యాదగిరి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు చెన్నా రెడ్డి, జిల్లా కౌన్సిలర్ బాబు సింగ్ పాల్గొన్నారు.



JNTUHలో మెగా జాబ్ మేళా

- JNTUHలో 'మెగా జాబ్ మేళా–2026' పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, నవంబర్ 24:

TTPOA, JNTUH సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 5న JNTUH క్యాంపస్‌లో నిర్వహించనున్న 'మెగా జాబ్ మేళా-2026' పోస్టర్‌ను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి. క్రిషన్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ జాబ్ మేళాలో 2020-2026 బ్యాచ్‌ల B.Tech, MBA, ఫార్మసీ గ్రాడ్యుయేట్లు పాల్గొనవచ్చు. ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ORVANTA Career Craft అసెస్‌మెంట్ భాగస్వామిగా వ్యవహరిస్తోంది.

కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు ఉచిత విద్య

హైదరాబాద్, నవంబర్ 24:

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగరేణి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల పిల్లలకు సింగరేణి పాఠశాలల్లో పదో తరగతి వరకు ఉచిత విద్య అందించనున్నారు. సింగరేణి పరిధిలోని 12 ఏరియాల్లో పనిచేస్తున్న సుమారు 30 వేల మంది కార్మికుల కుటుంబాలకు ఈ నిర్ణయం ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం 9 సింగరేణి పాఠశాలల్లో చదువుతున్న 400 మందికి పైగా పిల్లలకు తక్షణమే ఈ సదుపాయం వర్తించనుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్తగా చేరే పిల్లలకు కూడా ఉచిత విద్య అందించనున్నారు.ఈ నిర్ణయం కార్మికుల కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఊరటనిస్తుందని సింగరేణి యాజమాన్యం తెలిపింది.

గొల్లపల్లిలో 735 మందికి కొత్త ఆసరా పెన్షన్లు





- అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి, నవంబర్ 24

గొల్లపల్లి మండలంలో కొత్తగా మంజూరైన 735 ఆసరా చేయూత పెన్షన్లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో ఇప్పటికే 9,336 మంది పెన్షన్లు పొందుతుండగా, కొత్తగా 735 మందికి మంజూరుతో మొత్తం 10,071 కుటుంబాలకు పెన్షన్ అందుతోందని మంత్రి తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ పెన్షన్ రానివారికి మరోసారి దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు.గొల్లపల్లి మండలంలో 2,457 కొత్త రేషన్ కార్డులు, 545 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలలు తదితర అభివృద్ధి పనులకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.జిల్లా వ్యాప్తంగా 13,913 కొత్త పెన్షన్లు మంజూరు కాగా, ధర్మపురి నియోజకవర్గానికి 3,400 పెన్షన్లు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ రఘువర

భారత్ ఫ్యూచర్ సిటీలో మంత్రి శ్రీధర్ బాబు పర్యటన

హైదరాబాద్, నవంబర్ 24:

మంత్రి శ్రీధర్ బాబు భారత్ ఫ్యూచర్ సిటీలో పర్యటించి గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాన వేదిక, ఎక్స్‌పో జోన్, భద్రత, ట్రాఫిక్, కనెక్టివిటీ, అతిథుల వసతులపై సమీక్షించారు.తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరిగేలా ఏర్పాట్లు చేయాలని, పెండింగ్ పనులను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, ఎలాంటి లోపాలకు తావులేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.



అయ్యప్ప భక్తులకు సరుకులు అందజేసిన కసిర బోయిన లింగయ్య యాదవ్

వలిగొండ నవంబర్ 24 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అరూర్ గ్రామం యాదవ సంఘం అధక్షులు కాసిరబోయిన లింగయ్య యాదవ్ అయ్యప్ప స్వాములకు వారి కుటుంబ సభ్యులు అయ్యప్ప సన్నిధానానికి నెల రోజుల కు భిక్ష కి సరిపడా సరుకులు అందచేయడం జరిగింది. అయ్యప్ప భక్తులు కసిరబోయిన లింగయ్య యాదవ్ కు కుటుంబమునకు కృతజ్ఞతలు తెలిపారు.



కలబురిగిలో మంత్రి శరణ్ ప్రకాష్ పాటిల్‌తో డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి భేటీ

కలబురిగి:(కర్ణాటక)గాణగాపూర్ పర్యటనలో భాగంగా శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కర్ణాటక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శరణ్ ప్రకాష్ పాటిల్‌ను కలబురిగిలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇరువురు నేతలు ఆప్యాయంగా పలకరించుకుని పలు జ్ఞాపకాలను పంచుకున్నారు.గతంలో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఇద్దరూ రవాణా శాఖ మంత్రులుగా ఉన్న సమయంలో సేడం, తాండూరు నియోజకవర్గాల్లో బస్సు సౌకర్యాలు, రహదారుల నిర్మాణం, కాగ్నా నీటి సరఫరా, రైతు సంక్షేమం తదితర అభివృద్ధి కార్యక్రమాలపై చేసిన కృషిని నెమరువేసుకున్నారు. భవిష్యత్‌లోనూ ప్రజా సంక్షేమం కోసం పరస్పర సహకారంతో కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ భేటీలో టీపీసీసీ ప్రచార కమిటీ సమన్వయకర్త కరుణం పురుషోత్తం రెడ్డి, బిర్కిట్ రఘు, పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పైళ్ల ప్రతాపరెడ్డి మృతి

వలిగొండ నవంబర్ 24 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గోపరాజుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ పోలీస్ పటేల్ పైళ్ల ప్రతాప్ రెడ్డి మంగళవారం సాయంత్రం మరణించారు. అతడు గ్రామంలో 50 సంవత్సరాల క్రితం సర్పంచ్ వ్యవస్థ రాకముందు గ్రామంలో పోలీస్ పటేల్ గా సేవలందించారు. ప్రజలలో అందరితో కలుపుకొని ఏ సమస్య అయినా ప్రజల ముందు పరిష్కరిస్తూ ప్రజలతో మమేకమై ఉండేవారని అతడి మరణం గ్రామానికి తీరని లోటు అని ప్రజలు తెలిపారు.



మెడికోల సమస్యల పరిష్కారానికి చర్యలు

కరీంనగర్: ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. మరో 15 రోజుల్లో బాలురు, బాలికల హాస్టళ్లను విద్యార్థులకు అప్పగించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కొత్త వైద్య కళాశాల భవన నిర్మాణం మరో ఆరు నెలల్లో పూర్తి చేయాలని చర్యలు చేపట్టారు. విద్యుత్ సరఫరా కోసం ఎన్పీడీసీఎల్‌కు రూ.19 లక్షలు, కళాశాలకు నీటి వసతి కల్పించేందుకు రూ.85 లక్షలు కేటాయించారు. నర్సింగ్ కళాశాల విద్యుత్ పనులకు అదనంగా రూ.11.40 లక్షలు మంజూరు చేశారు.హాస్టళ్లలో లిఫ్ట్‌లు, ఇన్వర్టర్లు, ఏసీలు తదితర సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. విద్యార్థుల సమస్యలను పరిశీలించేందుకు కరీంనగర్ ఆర్డీఓ, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌తో కలిసి కళాశాలను సందర్శించి వసతులపై ఆరా తీశారు.ఆరోగ్యశాఖ మంత్రి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంత్రుల చొరవతో పాటు కలెక్టర్, డీఎంఈ, సంబంధిత అధికారులు సమస్యల పరిష్కారాన్ని పర్యవేక్షిస్తున్నారు. విద్యార్థులకు తరగతులకు ఎలాంటి ఆటంకం లేకుండా అవసరమైన మౌలిక వసతులు త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు చర్యలు కొనసాగిస్తున్నారు

పేదింటికి ఆర్థిక ధైర్యం.. రూ.5 లక్షల జీవిత బీమా

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో పేదలకు ఆర్థిక భరోసా
- అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు



సంగారెడ్డి, నవంబర్ 23 (సమయం న్యూస్)

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించి, ఆపద సమయంలో అండగా నిలవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, రాయికోడ్ వట్టిపల్లి మునిపల్లి ఆత్మ కమిటీ చైర్మన్ కచ్చురావు అన్నారు. కుటుంబానికి ఆధారమైన వ్యక్తిని కోల్పోయిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల బీమా భరోసా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఎంతో ఉపయోగకరమని ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రి దామోదర్ రాజ నర్సింహ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, పేద కుటుంబాల ఆర్థిక భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం చేకూరేలా ఆయన అన్నారు

శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో ఘనంగా గోశాల ప్రారంభం

కొడంగల్ మున్సిపల్, నవంబర్,24(సమయం న్యూస్)

కొడంగల్ పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన గోశాలను ఆలయ ధర్మకర్తల చేతులమీదుగా ఘనంగా ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గోశాల ప్రారంభోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోమాత సంరక్షణ, సేవ, పోషణ ఎంతో పవిత్రమైన కార్యమని, గోసేవ ద్వారా ఆధ్యాత్మికతతో పాటు ధార్మిక విలువలు పెంపొందుతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు.అర్చకులు, భక్తులు మరియు పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.



మత్స్యగిరి గుట్ట ఆలయంలో అన్నప్రసాదం నిర్వహించిన కసిర బోయిన అరుణ యాదవ్

వలిగొండ నవంబర్ 24 (సమయం న్యూస్)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని ఆరూరు గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మత్స్యగిరి గుట్ట మాజీ డైరెక్టర్ ఆరూరు గ్రామ యాదవ సంఘం అధ్యక్షులు కసిరబోయిన లింగయ్య అరుణ యాదవ్ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ఇటీవల జరిగిన మత్స్యగిరిగుట్ట బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం రోజున వచ్చిన భక్తులకు సుమారు 1000 మందికి అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ధర్మకర్తలు భక్తులు సిబ్బంది పాల్గొన్నారు.



హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్ గౌడ్ తండ్రి అంత్యక్రియలకు హాజరైన కాంగ్రెస్ నాయకులు

రామన్నపేట, నవంబర్ 24 (సమయం న్యూస్)



యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం బోగారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ,మాజీసర్పంచ్ కూనూరు గోపాల్ గౌడ్ మృతి చెందడంతో ఆయన అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. ఆయన హైకోర్టు న్యాయమూర్తి కూనూరు లక్ష్మణ్ గౌడ్ తండ్రి కావడంతో పలువురు రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు అంత్యక్రియలకు హాజరై కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు చెరుకు సుధాకర్ గౌడ్, జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె రవికుమార్ గౌడ్, రెడ్డరే పాక మాజీ సర్పంచ్ మాద శంకర్ గౌడ్ తదితరులు పాల్గొని కూనూరు గోపాల్ గౌడ్ భౌతికకాయానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు.కూనూరు గోపాల్ గౌడ్ మృతి ట్ల పలువురు గ్రామస్థులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

పల్స్ పోలియో 99.78 శాతం పూర్తి

హైదరాబాద్, నవంబర్ 24: జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం 99.78 శాతం పూర్తయిందని డీఎంహెచ్ఓ డా. పి. శ్రీనివాస్ తెలిపారు. 0-5 ఏళ్లలోపు 5,43,235 మంది చిన్నారులకు గాను 5,42,061 మందికి పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు. మిగిలిన 1,184 మంది చిన్నారులను ఇంటింటి సందర్శన ద్వారా గుర్తించి పోలియో చుక్కలు వేయాలని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లను ఆదేశించారు. అర్హులైన ఏ ఒక్క చిన్నారూ మిగలకుండా 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు.

సంగారెడ్డి ప్రజల దాహం తీర్చాలి!

- లేదంటే ప్రజలతో కలిసి వాటర్ వార్‌కు కార్యాచరణ.. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హెచ్చరిక
- సింగూర్‌లో నీళ్లున్నా సంగారెడ్డి ప్రజలకు తాగునీటి కష్టాలా? బీర్ కంపెనీలకు నీటి సరఫరాపై ఉన్న శ్రద్ధ ప్రజల దాహం తీర్చడంలో ఎందుకు లేదు?
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే సింగూర్, మంజీరా జలాశయాలకు ఈ దుస్థితి.. ముందస్తు ప్రణాళిక లేకుండా ప్రజలను కరువు కోరల్లోకి నెట్టారు .



సంగారెడ్డి జిల్లా సమయం న్యూస్ నవంబర్24

సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల తాగునీటి సమస్యపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంజీరా డ్యామ్‌ను సందర్శించారు.
హైదరాబాద్ సరఫరా అవుతున్న తాగునీటి పైప్ లైన్ లీక్ కావడం తో వెంటనే సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఫోన్ చేసి మాట్లాడారు... వెంటనే నీళ్ళు వృధా పోకుండా చూడాలని కోరారు...

ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ..

ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ముందుగానే హెచ్చరిక లు వచ్చినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కనీస ముందస్తు ప్రణాళిక రూపొందించలేదని విమర్శించారు. సింగూర్ ప్రాజెక్టు మరమ్మతుల పేరుతో అందులో ఉన్న నీటిని ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా వదిలేయడం ప్రభుత్వ అవగాహనారాహిత్యానికి నిదర్శనమన్నారు. సముద్రాల మీద పంతెనలు నిర్మిస్తున్న ఈ ఆధునిక కాలంలో.. నీటిని నిల్వ చేసుకుంటూనే మరమ్మతులు చేసే సాంకేతికత లేదా? నీళ్లను వదిలేసి మరమ్మతులు చేయడమేనా కాంగ్రెస్ ప్రభుత్వ ముందుచూపు? అని నిలదీశారు.
సింగూర్ జలాశయంలో ప్రస్తుతం సుమారు 1.9 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఈ నీటి నిల్వలు డిసెంబర్ వరకు మాత్రమే సరిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ తర్వాత సంగారెడ్డి ప్రజల తాగునీటి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.సింగూర్ జలాలపై సంగారెడ్డి, మెదక్, నిజామాబాద్‌తో పాటు హైదరాబాద్ ప్రాంతాలు కూడా ఆధారపడుతున్నాయని, ఇంతటి కీలకమైన అంశంపై జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి, ముఖ్యమంత్రి కనీసం సమీక్ష నిర్వహించకపోవడం దారుణమన్నారు.రెండు మున్సిపాలిటీలు, నాలుగు మండలాల ప్రజలకు వారానికి ఒక్కసారి కూడా సక్రమంగా నీళ్లు అందడం లేదు. మరోవైపు బీర్ కంపెనీలకు నీటి సరఫరా మాత్రం కొనసాగుతోంది. కంపెనీలపై ఉన్న శ్రద్ధ సామాన్య ప్రజలపై ఎందుకు లేదు? ప్రజల దాహం కంటే కంపెనీల అవసరాలే ప్రభుత్వానికి ముఖ్యమా? అని ప్రశ్నించారు.మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న సుమారు 50 ఎంఎల్డీ నీటి సరఫరా కూడా నిలిచిపోతే సంగారెడ్డి నియోజకవర్గం తీవ్రమైన తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.మంజీరా నదిలో అక్రమంగా బోర్లు వేసి నీటిని తోడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అక్రమ నీటి వినియోగంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సింగూర్, మంజీరా జలాశయాల్లో పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. సంగారెడ్డి ప్రజల అవసరాలు తీర్చిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటి సరఫరాపై నిర్ణయం తీసుకోవాలి.జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ప్రజల గొంతు ఎండిపోతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తుందా? నీళ్లు ఇవ్వకపోతే ప్రజల తిరుగుబాటు తప్పదు. అవసరమైతే ప్రజలను సమీకరించి వాటర్ వార్‌కు కార్యాచరణ రూపొందిస్తాం. ప్రజల తాగునీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా భూతు పురాణాలతో కాలం గడుపుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడం లేదని, ప్రజల కనీస అవసరమైన తాగునీటిని కూడా అందించలేని పరిస్థితి నెలకొందన్నారు.మాటలతో మభ్యపెట్టే రోజులు పోయాయి.. నీళ్లతోనే ప్రజల దాహం తీరాలి. హామీలతో బతుకులు మారవు.. చేతల్లోనే పాలన కనిపించాలి.ప్రజల సహనాన్ని చేతకానితనంగా భావిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. సంగారెడ్డి ప్రజల తాగునీటి సమస్య పరిష్కార మయ్యే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని, ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, కౌన్సిలర్లు, లాడే మల్లేశం, నాయకులు జీవీ శ్రీనివాస్, కసిని శ్రీకాంత్, , పాండు పాల్గొన్నారు.

మంచినీటిని పొదుపుగా వాడాలి...

- నీటిని వృథా చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవు..
- ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి...

రాయపోల్: నవంబర్ 24. (సమయం న్యూస్)

మంచినీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వినియోగించుకోవాలని, నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు పాటించాలని సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్ర గ్రామ సర్పంచ్ మాసంపల్లి రాజు గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ..
రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున ఇప్పటి నుంచే నీటి సంరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరానికి మించి నీటిని వినియోగించకుండా, ప్రతి నీటి బొట్టును విలువైనదిగా భావించాలని కోరారు. ఇళ్లలో కుళాయిలు లీకేజీ కాకుండా చూసుకోవాలని, నీటిని అనవసరంగా పారబోయకుండా పొదుపు చేయాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని తెలిపారు. దీనివల్ల భూగర్భ జలమట్టం పెరిగి భవిష్యత్తులో నీటి సమస్యలను కొంతవరకు నివారించవచ్చన్నారు.నీటి సంరక్షణ ఒక్కరి బాధ్యత కాదని, గ్రామంలోని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి సహకరించాలని కోరారు. గ్రామంలో నీటి వృథాను అరికట్టి, భవిష్యత్ తరాలకు నీటి కొరత లేకుండా చూడాలని సర్పంచ్ మాసంపల్లి రాజు విజ్ఞప్తి చేశారు.



మాజీ సీడీసీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కాసాల బుచ్చిరెడ్డి జన్మదిన వేడుకలు

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్24

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సమక్షంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కాసాల బుచ్చిరెడ్డికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కాసాల బుచ్చిరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొని కాసాల బుచ్చిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలను దర్శించుకున్న గండ్ర దంపతులు

భూపాలపల్లి, నవంబర్ 24

కార్తీక పౌర్ణమి సందర్భంగా భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్, భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి దంపతులు పలు ఆలయాలను దర్శించుకున్నారు.చిట్యాల మండలం నైన్పాక గ్రామంలోని స్వయంభూ శ్రీ జ్ఞానశంకరుల చతుర్దశ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సత్యనారాయణ స్వామి వ్రతంలో గండ్ర జ్యోతి పాల్గొన్నారు. అనంతరం రేగొండ మండలంలోని భుగులోని శ్రీ వేంకటేశ్వర స్వామి జాతరలో గండ్ర దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమాల్లో భూపాలపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏదులాపురంలో రూ.40 కోట్ల అభివృద్ధి పనులు

- ఏదులాపురంలో రూ.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ఖమ్మం, నవంబర్ 24:

అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.ఏదులాపురం మున్సిపాలిటీలోని 25, 26వ వార్డుల్లో రూ.2.49 కోట్లతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల పనులకు, గుర్రాలపాడు-కోట నారాయణపురం రోడ్డు నుంచి ఆబాదిప్ వరకు రూ.2.70 కోట్లతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు.గత పాలకుల తప్పిదాల వల్ల నీటి రంగంలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించేందుకు కేంద్ర, మహారాష్ట్ర ప్రభుత్వాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్చలు జరుపుతున్నారని మంత్రి తెలిపారు. తెలంగాణకు కృష్ణా, గోదావరి జలాల్లో రావాల్సిన వాటాను కాంగ్రెస్ ప్రభుత్వం కాపాడుతుందని స్పష్టం చేశారు.గత 45 రోజుల్లో ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ఎల్3 నుంచి ఎల్1కు సంబంధించిన సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని చెప్పారు.కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ జి. వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



రామకృష్ణ ట్రేడర్స్ లో ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా

సంగారెడ్డి జిల్లా సమయ న్యూస్ నవంబర్24

రామకృష్ణ ట్రేడర్స్ కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజలు నిర్వహించిన గోపాల్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణ టైలర్స్ లో దీపావళి ముగింపు సందర్భంగా పదేక పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో కురుమ సంఘం మండల యూత్ ప్రెసిడెంట్ అంజి కుర్మా టేకూర్ గ్రామ ఉపసర్పంచ్ నర్సింలు నాయకులు జనార్ధన్ నర్సింలు గోపాల్ మధు రైతులు వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొన్నారు



ధోనీ సేవలు ఎప్పటికీ మరువలేం!

ధోనీ వీడ్కోలుపై భావోద్వేగానికి గురైన ఇషాన్ కిషన్

కావ్య మారన్‌కు వివాహ శుభాకాంక్షలు తెలిపిన ఇషాన్

చెన్నై, నవంబర్ 24 (సమయం న్యూస్): భారత క్రికెట్‌కు మహేంద్ర సింగ్ ధోనీ చేసిన సేవలు ఎప్పటికీ మరువలేనివని టీమిండియా వికెట్ కీపర్, బ్యాటర్ ఇషాన్ కిషన్ పేర్కొన్నాడు. ఐపీఎల్‌కు ధోనీ వీడ్కోలు పలకడంపై భావోద్వేగానికి గురయ్యాడు. ధోనీ నిర్ణయం అభిమానులతోపాటు ఆటగాళ్లను కూడా బాధించిందని, ఎంతోమంది యువ క్రికెటర్లకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని కొనియాడాడు. దేశం కోసం ధోనీ సాధించిన విజయాలను అందుకోవడం చాలా కొద్దిమందికే సాధ్యమవుతుందన్నాడు. వీడ్కోలు పలికేందుకు ఇదే సరైన సమయమని ధోనీ భావించి ఉండవచ్చని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్--2027 ఆటగాళ్ల కొనసాగింపు ప్రకటన సందర్భంగా ఈ నెల 17న ధోనీ రిటైర్మెంట్ విషయాన్ని చెన్నై సూపర్ కింగ్స్ వెల్లడించింది. ఇకపై జట్టుకు మార్గదర్శకుడిగా ఆయన వ్యవహరించనున్నట్లు తెలిపింది. 2019లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన ధోనీ 2020లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 2025 ఐపీఎల్ సీజన్‌లో చివరిసారిగా మైదానంలో కనిపించాడు. 2026 సీజన్‌లో జట్టులో కొనసాగినప్పటికీ గాయం కారణంగా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేకపోయాడు. ఇకపై ఆటగాడిగా కాకుండా మార్గదర్శకుడిగా చెన్నై జట్టుకు ధోనీ సేవలు అందించనున్నాడు. ఐపీఎల్--2027 వేలంలోనూ చెన్నై యాజమాన్యంతో కలిసి ధోనీ పాల్గొనే అవకాశం ఉన్నట్లు సమాచారం. మరోవైపు సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈవో కావ్య మారన్‌కు ఇషాన్ కిషన్ వివాహ శుభాకాంక్షలు తెలిపాడు. అనారోగ్యం కారణంగా వివాహ వేడుకకు హాజరుకాలేకపోయానని, వ్యక్తిగతంగా మాట్లాడి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశానని వెల్లడించాడు.

నా మౌనాన్ని బలహీనతగా భావించొద్దు

చట్టపరమైన చర్యలు తీసుకుంటా.. : పృథ్వీ షా వార్నింగ్!

ముంబై, నవంబర్ 24 (సమయం న్యూస్): టీమిండియా బ్యాటర్ పృథ్వీ షా మరోసారి వార్తల్లో నిలిచాడు. భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ తండ్రి యోగ్‌రాజ్ సింగ్ చేసిన వ్యాఖ్యలపై షా తీవ్రంగా తాజాగా స్పందించాడు. తన వ్యక్తిగత జీవితం, గతాన్ని ప్రస్తావిస్తూ తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా మాట్లాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించాడు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో సుదీర్ఘమైన నోట్‌ను షేర్ చేశాడు. అందులో యోగ్‌రాజ్ పేరును నేరుగా ప్రస్తావించకపోయినప్పటికీ.. ఇటీవల తనపై చేసిన వ్యాఖ్యలకు సమాధానంగానే పృథ్వీ షా ఈ పోస్ట్ పెట్టినట్లు తెలుస్తోంది. స్పోర్ట్స్ లాంచ్‌ప్యాడ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో యోగ్‌రాజ్ సింగ్ మాట్లాడుతూ.. పృథ్వీ షా కెరీర్ పతనానికి అతడి జీవనశైలే కారణమని వ్యాఖ్యానించాడు. గతంలో భారత మాజీ బ్యాటర్ వినోద్ కాంబ్లీ ఎదుర్కొన్న పరిస్థితులతో షాను పోల్చాడు. 'పృథ్వీ షా కెరీర్ ఎందుకు దిగజారింది?. గతంలో వినోద్ కాంబ్లీ విషయంలోనూ ఇదే జరిగింది. పార్టీలు, మహిళలతో సంబంధాలు, సిగరెట్లు, మద్యం ఇందుకు కారణం. కాంబ్లీకి ఎంతో ప్రతిభ ఉన్నప్పటికీ.. అర్ధరాత్రి దాటిన తర్వాత గదికి వచ్చేవాడు. ఒకసారి అతడిని ఈ విషయంపై ప్రశ్నించాను. కానీ తన రోజులు అయిపోయాయని, తాము భిన్నమైన క్రికెట్ ఆడుతున్నామని సమాధానమిచ్చాడు. మరుసటి రోజు కోర్ట్నీ వాల్ష్ బౌలింగ్‌లో అతడు ఔటయ్యాడు. తర్వాత అతడితో ఉన్న అమ్మాయి కూడా వెళ్లిపోయింది. సిగరెట్లు, మద్యం ఇచ్చేవారు కూడా లేకుండా పోయారు. షా విషయంలోనూ ఇలాగే జరిగింది. చెడు స్నేహాలు, పార్టీలు, మద్యం వంటి అలవాట్లు ఉంటే ఇలాంటి పరిణామాలే ఎదురవుతాయి' అని యోగ్‌రాజ్ అన్నాడు. యోగ్‌రాజ్ వ్యాఖ్యలపై స్పందించిన పృథ్వీ షా.. తన గతం గురించి దాచాల్సిందేమీ లేదని స్పష్టం చేశాడు. 'నా గతం నా జీవితంలో ఒక భాగం. దాచడానికి లేదా సిగ్గుపడటానికి లేదు. అయితే నా పేరును, వ్యక్తిగత జీవితాన్ని, గతాన్ని ఉపయోగించుకుని నాపై దుష్ప్రచారం చేయడం, అనవసర వివాదాలు సృష్టించడం, నా ప్రతిష్ఠను దెబ్బతీయడంను సహించను. ఓ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి, ఉద్దేశపూర్వకంగా తప్పుడు వ్యాఖ్యలు చేయడానికి మధ్య చాలా తేడా ఉంది. ఇది చివరి హెచ్చరికగా భావించండి. ఇలాంటి చర్యలకు పాల్పడే వ్యక్తులు లేదా ప్లాట్‌ఫామ్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా' అని షా తన పోస్ట్‌లో పేర్కొన్నాడు.



వైభవ్ విధ్వంసం.. సిక్సర్ల సునామీ!

- 53 బంతుల్లోనే 204 పరుగులతో సంచలనం
- 28 సిక్సర్లు, 7 ఫోర్లతో రికార్డుల మోత
- యూఏఈపై భారత్-ఏ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం
- సెమీఫైనల్ దిశగా భారత్-ఏ



దోహా, నవంబర్ 24 (సమయం న్యూస్): ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ 2026 టోర్నీలో ఇండియా ఏ జట్టు సంచలన విజయంతో సెమీఫైనల్ రేసులో దూసుకెళ్లింది. యూఏఈ ఏతో జరిగిన కీలక పోరులో తిలక్ వర్మ సారథ్యంలోని ఇండియా ఏ ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. యూఏఈ నిర్దేశించిన 250 పరుగుల లక్ష్యాన్ని కేవలం 14.2 ఓవర్లలోనే ఛేదించి ప్రత్యర్థికి చుక్కలు చూపించింది. ఈ ఏకపక్ష విజయానికి యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ఆడిన ఊహించని ఇన్నింగ్స్ ప్రధాన కారణమైంది. కేవలం 53 బంతుల్లో 204 పరుగులు బాదిన వైభవ్, లిస్ట్-ఏ క్రికెట్ చరిత్రలో కొత్త రికార్డులను నెలకొల్పాడు.

భాటియా శతకం..
అర్షద్ ఖాన్ ధాటికి తడబడ్డ యూఏఈ

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న యూఏఈ ఏ జట్టుకు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తొలి ఓవర్‌లోనే ఓపెనర్ ఆర్యాంశ్ శర్మ పెవిలియన్ చేరగా, ఆ తర్వాత అర్షద్ ఖాన్ బౌలింగ్ ధాటికి యూఏఈ బ్యాటర్లు వరుసగా కష్టాల్లో పడ్డారు. అయితే ఒక వైపు వికెట్లు పడుతున్నా హర్ప్రీత్ సింగ్ భాటియా మాత్రం దీటుగా నిలబడి అద్భుత శతకం సాధించాడు. 144 బంతులు ఎదుర్కొన్న భాటియా 12 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 130 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. ఎథన్ డిసౌజా 25 పరుగులతో ఆదుకోగా, భారత బౌలర్లలో అర్షద్ ఖాన్ 43 పరుగులిచ్చి 4 వికెట్లతో సత్తా చాటాడు. దీంతో యూఏఈ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 249 పరుగులు చేసింది.

16 బంతుల్లో హాఫ్ సెంచరీ.. 28 బంతుల్లో శతకం

250 పరుగుల లక్ష్య ఛేదనలో వైభవ్ సూర్యవంశీ తొలి బంతి నుంచే బౌలర్లపై విరుచుకుపడ్డాడు. అభిషేక్ శర్మతో కలిసి తొలి వికెట్‌కు 68 పరుగులు జోడించాడు. అభిషేక్ 5 బంతుల్లో 12 పరుగులు చేసి ఔటవగా, ఆ వెంటనే ప్రభ్‌సిమ్రన్ సింగ్ కూడా 4 బంతుల్లో 3 పరుగులకే వెనుదిరిగాడు. అయినా సరే వైభవ్ తన దూకుడును ఏమాత్రం తగ్గించలేదు. కేవలం 16 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసిన అతను, ఆ తర్వాత కేవలం 28 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత వేగవంతమైన శతకం నమోదు చేశాడు.

52 బంతుల్లో డబుల్ సెంచరీ.. సిక్సర్ల వర్షం

శతకం పూర్తయ్యాక వైభవ్ మరింత భీకరంగా మారిపోయాడు. బౌండరీలతో పాటు సిక్సర్ల వర్షం కురిపిస్తూ మైదానాన్ని హోరెత్తించాడు. కేవలం 40 బంతుల్లోనే 150 పరుగుల మైలురాయిని చేరుకున్న వైభవ్, 52 బంతుల్లోనే డబుల్ సెంచరీ మార్కును అందుకుని అందరినీ విస్మయానికి గురిచేశాడు. చివరకు 53 బంతుల్లో 28 సిక్సర్లు, 7 ఫోర్లతో 204 పరుగుల వద్ద ఔటయ్యాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత వేగంగా డబుల్ సెంచరీ చేసిన ఆటగాడిగా నిలిచి చరిత్ర సృష్టించాడు. అతని విధ్వంసకర ఇన్నింగ్స్‌తో మ్యాచ్ స్వరూపమే మారిపోయింది.

సెమీస్ దిశగా ఇండియా ఏ..
యూఏఈ ఇంటిదారి

వైభవ్ ఔటైన తర్వాత కూడా ఇండియా ఏ బ్యాటర్లు మిగిలిన పనిని వేగంగా పూర్తి చేశారు. కేవలం 14.2 ఓవర్లలోనే 250 పరుగులు చేసి 7 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకున్నారు. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల్లో నాలుగు పాయింట్లు సాధించిన ఇండియా ఏ సెమీఫైనల్ అవకాశాలను మరింత పటిష్టం చేసుకుంది. గత మ్యాచ్‌లో పాకిస్థాన్ ఏ చేతిలో 48 పరుగుల తేడాతో ఓడిన తర్వాత ఈ గెలుపు జట్టుకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చింది. మరోవైపు ఈ ఓటమితో యూఏఈ ఏ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది.

మరో బాల్ ట్యాంపరింగ్ ప్లాన్?



వెలుగులోకి సంచలన విషయాలు!

మెల్‌బోర్న్, నవంబర్ 24 (సమయం న్యూస్): ఆస్ట్రేలియా క్రికెట్ జట్టును మరోసారి బాల్ ట్యాంపరింగ్ వివాదం వెంటాడుతోంది. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్‌లో వెలుగుచూసిన శాండ్‌పేపర్‌గేట్ ఘటనకు సంబంధించి తాజాగా సంచలన విషయాలు బయటకు వచ్చాయి. ఆస్ట్రేలియాకు చెందిన సెన్ మీడియా సంస్థ కోసం జర్నలిస్ట్ గెరార్డ్ వాట్లీ నిర్వహించిన పరిశోధనలో, పాకిస్థాన్‌తో 2018 అక్టోబర్‌లో దుబాయ్ వేదికగా జరిగిన తొలి టెస్టులో బంతి స్వభావాన్ని మార్చేందుకు మింట్స్ ఉపయోగించాలనే ఆలోచన జట్టులో చర్చకు వచ్చినట్లు ఆరోపణలు వెల్లడయ్యాయి. నివేదిక ప్రకారం, పాకిస్థాన్‌పై బౌలర్లు పిచ్ నుంచి ఆశించినంతగా స్వింగ్ రాబట్టలేకపోవడంతో కొందరు ఆస్ట్రేలియా ఆటగాళ్లు బంతిని ట్యాంపరింగ్ చేసే మార్గాల గురించి చర్చించారట. ఈ క్రమంలో మింట్స్ ఉపయోగించే అవకాశాన్ని ఓ ఆటగాడు ప్రస్తావించినట్లు సమాచారం. 'మింట్స్ ఎవరి దగ్గర ఉన్నాయి?. ఈరోజు బంతిపై ఎవరు రుద్దుతారు' అంటూ అతడు ప్రశ్నించినట్లు నివేదిక పేర్కొంది. అయితే ఈ సూచనకు జట్టులోని మరో సభ్యుడు తీవ్ర అభ్యంతరం తెలిపినట్లు వెల్లడించింది. ఈ వ్యవహారం గురించి తెలుసుకున్న అప్పటి ఆస్ట్రేలియా హెడ్ కోచ్ జస్టిన్ లాంగర్ ఆటగాళ్లను నిలదీసినట్లు నివేదిక తెలిపింది. బంతిని ట్యాంపరింగ్ చేయాలనే ఆలోచనపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారట. అప్పటి కెప్టెన్ టిమ్ పైన్ కూడా జోక్యం చేసుకుని అలాంటి ఘటన జరగకుండా చర్యలు తీసుకున్నట్లు కథనం పేర్కొంది. దక్షిణాఫ్రికాలో శాండ్‌పేపర్ వివాదం జరిగిన ఆరు నెలలకే ఈ చర్చ తెరపైకి వచ్చినట్లు నివేదిక వెల్లడించింది. శాండ్‌పేపర్‌గేట్ వివాదం సమయంలో జట్టులో చోటుచేసుకున్న అంతర్గత పరిణామాలపైనా ఈ నివేదిక పలు విషయాలను బయటపెట్టింది. ఈ ఘటనలో తన పాత్రపై డేవిడ్ వార్నర్‌ను మిచెల్ మార్ష్ నిలదీసినట్లు పేర్కొంది. అప్పట్లో కామెరాన్ బాన్‌క్రాఫ్ట్ మొత్తం బాధ్యతను తనపై వేసుకోవడానికి సిద్ధమైనప్పటికీ, స్టీవ్ స్మిత్ మాత్రం ఈ వ్యవహారంలో బాధ్యతను పంచుకోవాలని భావించినట్లు తెలిపింది. జట్టు హోటల్‌లో వార్నర్‌తో మార్ష్ తీవ్రంగా వాదించినట్లు ఓ వర్గం వెల్లడించింది. 'ఈసారి నువ్వు తప్పించుకోలేవు మిత్రమా.. బాంగర్స్ (బాన్‌క్రాఫ్ట్) ఒక్కరినే బాధ్యుడిగా చేయడానికి మేము అంగీకరించం' అని వార్నర్‌తో చెప్పినట్లు కథనం పేర్కొంది. 2018లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో బంతి ఆకారాన్ని మార్చేందుకు శాండ్‌పేపర్ ఉపయోగించిన ఘటన అప్పట్లో ప్రపంచ క్రికెట్‌ను కుదిపేసింది. ఈ వివాదంలో స్టీవ్ స్మిత్, డేవిడ్ వార్నర్‌లపై 12 నెలల నిషేధం విధించగా, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌పై తొమ్మిది నెలల సస్పెన్షన్ విధించారు. తాజాగా దుబాయ్ టెస్టులో మింట్స్‌తో బంతి స్వభావాన్ని మార్చాలనే ఆలోచనపై వచ్చిన ఆరోపణలు ఆస్ట్రేలియా క్రికెట్‌లో మరోసారి చర్చకు దారితీశాయి.

ముంబై పగ్గాలు మళ్లీ రోహిత్‌కే?

వైస్ కెప్టెన్‌గా తెలుగు తేజం తిలక్ వర్మకు అవకాశం

ముంబై, నవంబర్ 24 (సమయం న్యూస్): ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్‌కు ముందే ముంబై ఇండియన్స్ (ఎంఐ) జట్టులో కీలక మార్పులు చోటుచేసుకోనున్నట్లు తెలుస్తోంది. ఎంఐ కొత్త కెప్టెన్‌ను ఈరోజు లేదా రేపు ప్రకటించే అవకాశం ఉందని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఐపీఎల్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ కెప్టెన్ రోహిత్ శర్మ మళ్లీ పగ్గాలు చేపట్టనున్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది. రోహిత్‌ను తిరిగి కెప్టెన్‌గా నియమించేందుకు ముంబై మేనేజ్‌మెంట్ సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. యువ ఆటగాడు, తెలుగు ప్లేయర్ తిలక్ వర్మకు ముంబై ఇండియన్స్ వైస్ కెప్టెన్సీ అప్పగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. జట్టులో భవిష్యత్తు నాయకత్వాన్ని సిద్ధం చేసే దిశగా ముంబై యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకోనుందట. అయితే దీనిపై ఫ్రాంచైజీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 39 ఏళ్ల రోహిత్ శర్మ మరో మూడు నాలుగేళ్లు జట్టులో కొనసాగే అవకాశాలు ఉన్నాయి. ఈలోగా తిలక్ వర్మను తదుపరి కెప్టెన్‌గా సిద్ధం చేయాలని ఎంఐ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా పేర్లు కెప్టెన్సీ రేసులో లేవని తెలుస్తోంది. సూర్యకుమార్ ఆటగాడిగా ముంబై ఇండియన్స్ జట్టుతోనే కొనసాగనున్నాడు. బుమ్రా విషయంలో అతడి పనిభారాన్ని నిర్వహించాల్సిన అవసరం కెప్టెన్సీ నిర్ణయంపై ప్రభావం చూపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు ఐపీఎల్‌లోనూ బుమ్రా బౌలింగ్ భారాన్ని దృష్టిలో ఉంచుకుని యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు సమాచారం. రోహిత్ శర్మ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ గతంలో ఎన్నో విజయాలు అందుకుంది. అతడి సారథ్యంలో ఏకంగా ఐదు టైటిల్స్ (2013, 2015, 2017, 2019, 2020) గెలిచింది. అందుకే అతడిని తిరిగి కెప్టెన్‌గా నియమించనున్నారనే వార్త అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. అయితే కెప్టెన్, వైస్ కెప్టెన్ ఎంపికపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ముంబై యాజమాన్యం చేసే ప్రకటనతోనే ఈ ఊహాగానాలకు స్పష్టత రానుంది.






డైలాగులు లేవని ఆటపట్టించేవారు!

'ఫ్యామిలీ ప్యాక్'తో పూర్తిస్థాయి వినోదాన్ని అందిస్తా

టీజర్ విడుదల కార్యక్రమంలో సాక్షి మడోల్కర్

హైదరాబాద్, నవంబర్ 24 (సమయం న్యూస్): తొలి సినిమాలో డైలాగులు లేకపోవడంతో తన స్నేహితులు సరదాగా ఆటపట్టించేవారని యువ కథానాయిక సాక్షి మడోల్కర్ తెలిపారు. ఇప్పుడు 'ఫ్యామిలీ ప్యాక్' చిత్రంలో డైలాగులతోపాటు డ్యాన్స్‌లు కూడా చేస్తూ ప్రేక్షకులను అలరించబోతున్నానని చెప్పారు. సందీప్ రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'మోగ్లీ' చిత్రంతో తెలుగు చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టిన సాక్షి.. తాజాగా శ్రీవిష్ణు సరసన 'ఫ్యామిలీ ప్యాక్'లో నటిస్తున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన చిత్ర టీజర్ విడుదల కార్యక్రమంలో సాక్షి తన అనుభవాలను పంచుకున్నారు. "శ్రీవిష్ణు కామెడీ టైమింగ్ అద్భుతంగా ఉంటుంది. ఆయనకు దీటుగా నటించడం చాలా కష్టమైంది. ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. వినోదాత్మక చిత్రంలో నటించడం ఇదే తొలిసారి. నా పాత్రకు న్యాయం చేయాలనే బాధ్యత, ఒత్తిడి ఉన్నప్పటికీ చిత్రబృందం ఎంతో సహకరించింది. చిత్రీకరణ సరదాగా సాగింది" అని తెలిపారు. తన తొలి చిత్రంలో సంభాషణలు లేకపోవడంతో 'ఏంటి.. నీకు డైలాగులే లేవా?' అంటూ స్నేహితులు ఆటపట్టించేవారని సాక్షి గుర్తుచేసుకున్నారు. అయితే 'ఫ్యామిలీ ప్యాక్'లో తన పాత్ర పూర్తిస్థాయిలో వినోదాన్ని పంచుతుందని చెప్పారు. మాట్లాడటంతోపాటు నృత్యాలతోనూ ప్రేక్షకులను అలరిస్తానని వెల్లడించారు. తన సినీ జీవితంలో సంక్రాంతికి విడుదలవుతున్న తొలి చిత్రం ఇదే కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సంక్రాంతిని 'ఫ్యామిలీ ప్యాక్'తో అందరం కలిసి వేడుకగా జరుపుకుందామని అభిమానులకు పిలుపునిచ్చారు. తొలి టీజర్‌తోనే ఆసక్తి రేకెత్తిస్తున్న ఈ చిత్రం 2027 సంక్రాంతి కానుకగా జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఇష్టం లేని సన్నివేశాల్లో నటించను!



నృత్యంపై ఇష్టంతోనే ఆ పాటకు అంగీకరించా

జాన్వీ కపూర్ అనుభవాలపై నేను మాట్లాడలేను

'పెద్ది' ప్రత్యేక గీతంపై శ్రుతి హాసన్ ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 24 (సమయం న్యూస్): ఇతరులను మెప్పించడం కోసం తనకు ఇష్టం లేని దుస్తులు ధరించడం, సన్నివేశాల్లో నటించడం చేయనని ప్రముఖ కథానాయిక శ్రుతి హాసన్ స్పష్టం చేశారు. రామ్ చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' చిత్రంలో మహిళా పాత్రల చిత్రీకరణపై కొనసాగుతున్న చర్చ నేపథ్యంలో ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ చిత్రంలోని 'హెల్లల్లలో' ప్రత్యేక గీతంలో రామ్ చరణ్, జాన్వీ కపూర్‌తో కలిసి శ్రుతి హాసన్ సందడి చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆ పాటలో నటించడానికి అంగీకరించడం వెనుక కారణాలను వెల్లడించారు. సినిమాల్లో ప్రత్యేక గీతాలు అవసరమా అనే ప్రశ్న తనకు కూడా అప్పుడప్పుడు ఎదురవుతుందని శ్రుతి తెలిపారు. అయితే నృత్యం చేయడం, అందంగా ముస్తాబవడం తనకు ఎంతో ఇష్టమని, అందుకే 'పెద్ది'లో ప్రత్యేక గీతానికి అంగీకరించానని చెప్పారు. గ్లామర్ విషయంలో తనకు ఎలాంటి అభ్యంతరాలు లేవని, అయితే దుస్తులు, సన్నివేశాల విషయంలో అసౌకర్యంగా అనిపిస్తే వెంటనే తన అభిప్రాయాన్ని వెల్లడిస్తానని పేర్కొన్నారు. ఈ విషయంలో గతంలో పలుమార్లు వాదనలు కూడా జరిగినట్లు తెలిపారు. 'పెద్ది' చిత్రంలో మహిళల చిత్రీకరణపై జరుగుతున్న చర్చను తాను అర్థం చేసుకోగలనని శ్రుతి చెప్పారు. అయితే తన వరకు పాటలోని నృత్యాన్ని ఆస్వాదించడమే ముఖ్యమన్నారు. జాన్వీ కపూర్‌తో కలిసి ఆ పాటలో నటించినప్పటికీ, చిత్రీకరణ సమయంలో ఆమెకు ఎదురైన అనుభవాల గురించి తాను మాట్లాడలేనని స్పష్టం చేశారు. ఎవరి అనుభవాలను వారే వెల్లడించడం సమంజసమనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఇటీవల విడుదలైన 'ఆకాశంలో ఒక తార' చిత్రంలో విభిన్నమైన పాత్రతో ప్రేక్షకులను ఆకట్టుకున్న శ్రుతి హాసన్.. తాజాగా 'పెద్ది' ప్రత్యేక గీతంపై చేసిన వ్యాఖ్యలతో మరోసారి వార్తల్లో నిలిచారు.



అర్జున్ కుమార్తెపై అనుచిత వ్యాఖ్యలు..

నటుడు బయిల్వాన్ రంగనాథన్‌పై కేసు

తన పెద్ద కుమార్తె, నటి ఐశ్వర్యపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారంటూ.. నటుడు, యూట్యూబర్ బయిల్వాన్ రంగనాథన్‌పై అర్జున్ సర్జా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చెన్నై సైబర్ క్రైమ్ పోలీసులు రంగనాథన్‌తో పాటు మరో వ్యక్తిపై మూడు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇటీవల తన చిన్న కుమార్తె అంజనా వివాహం జరిగిన సంగతి తెలిసిందే. అయితే ఈ వేడుకకు పెద్ద కుమార్తె ఐశ్వర్య హాజరు



కాకపోవడంపై సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. కొందరు దీనికి సంబంధించిన వీడియోలు, వ్యక్తిగత జీవితంపై ఆధారాలు లేని ఆరోపణలు ప్రచారం చేశారు. ఈ క్రమంలో ఐశ్వర్య వ్యక్తిగత అలవాట్ల గురించి కూడా అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు అర్జున్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇలాంటి ఆరోపణలు చేయడం వల్ల తన కుమార్తె ప్రతిష్ఠకు భంగం కలుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అర్జున్ ఫిర్యాదు నేపథ్యంలో చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన సైబర్ క్రైమ్ విభాగం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. మూడు సెక్షన్ల కింద బైల్వాన్ రంగనాథన్‌తో పాటు మరొకరిపై కేసు నమోదు చేసింది. ఈ క్రమంలో విచారణకు హాజరుకావాలని రంగనాథన్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. దీంతో ఆయన పోలీసు కార్యాలయానికి హాజరయ్యారు. అక్కడ అధికారులు ఆయనను ఏడు గంటలకు పైగా విచారించినట్లు సమాచారం.

నిహారిక 'పాకెట్ రాకెట్స్'

నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'పాకెట్ రాకెట్స్'. రుద్ర అత్రి దర్శకత్వం వహిస్తున్నారు. త్రినాథ్ వర్మ, నిర్మల్, శ్రియా కొంతం, జేడీ చక్రవర్తి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. డిసెంబరు 11న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానున్నది. ఈ నేపథ్యంలో మేకర్స్ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేశారు. 'అప్సర' అనే పాటను రిలీజ్ చేశారు. గ్యాని ఈ దీనికి సంగీతం అందించారు.



నా పెళ్లి ఎప్పుడైంది బాబూ?

నెటిజన్ వ్యాఖ్యకు డింపుల్ హయాతి సరదా కౌంటర్

హైదరాబాద్, నవంబర్ 24 (సమయం న్యూస్): తనకు పెళ్లయిందంటూ ఓ నెటిజన్ చేసిన వ్యాఖ్యపై టాలీవుడ్ కథానాయిక డింపుల్ హయాతి సరదాగా స్పందించారు. తనకు ఇంకా పెళ్లి కాలేదంటూ ఆమె ఇచ్చిన సమాధానం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. శర్వానంద్ కథానాయకుడిగా నటించిన 'భోగి' చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్ర ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇటీవల నిర్వహించిన విడుదల ముందస్తు వేడుకలో డింపుల్ హయాతి పాల్గొని సందడి చేశారు. ఈ వేడుకలో వేదికపై శర్వానంద్‌తో డింపుల్ సరదాగా మాట్లాడుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఓ మీమ్ పేజీ ఈ వీడియోను పంచుకోగా పలువురు నెటిజన్లు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఓ నెటిజన్ 'శర్వానంద్‌లాగే డింపుల్ హయాతికి కూడా పెళ్లయిపోయింది కదా' అంటూ వ్యాఖ్యానించాడు. దీనిపై స్పందించిన డింపుల్ తనకు ఇంకా పెళ్లి కాలేదంటూ సరదాగా బదులిచ్చారు. డింపుల్ ఇచ్చిన సమాధానంతో ఆమె వివాహంపై వచ్చిన ఊహాగానాలకు తెరపడింది. నెటిజన్ వ్యాఖ్యకు ఆమె స్పందించిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది. మరోవైపు ఈ వీడియోతో 'భోగి' చిత్రానికి సామాజిక మాధ్యమాల్లో అదనపు ప్రచారం లభించిందని సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు.



PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

దళిత సర్పంచ్‌కు గౌరవం లేదా?





- **కొండాపోచమ్మ ఆలయం ఎదుట ప్రజాసంఘాల ఆగ్రహం!**
- **బాధ్యులపై చర్యలు తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం**
- **కొండాపోచమ్మ ఆలయం ఎదుట ప్రజాసంఘాల భారీ రాస్తారోకో**

గజ్వేల్ నవంబర్ 24

ప్రజల ఓట్లతో ఎన్నికైన దళిత సర్పంచ్‌కు ప్రభుత్వ దేవస్థానం నిర్వహించే కార్యక్రమంలో కనీస గౌరవం కల్పించకపోవడం ప్రజాస్వామ్య విలువలను అవమానించడమేనని ప్రజాసంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగదేవపూర్ మండలం తీగుల్ నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ కొండాపోచమ్మ దేవస్థానం 25వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికలో స్థానిక దళిత సర్పంచ్ పేరును విస్మరించడాన్ని నిరసిస్తూ మంగళవారం ఆలయం ఎదుట వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. దేవస్థానం ఎవరి వ్యక్తిగత జాగీరు కాదని, ప్రజల విశ్వాసంతో నడిచే ఆలయంలో స్థానిక ప్రజాప్రతినిధికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత నిర్వాహకులకు లేదా అని ప్రశ్నించారు. దేవాదాయ శాఖ పరిధిలోని దేవస్థానానికి ప్రభుత్వం చైర్మన్, డైరెక్టర్లను నియమించినప్పటికీ, అదే గ్రామానికి ఎన్నికైన సర్పంచ్ పేరును ఆహ్వాన పత్రికలో చేర్చకపోవడం వెనుక ఉన్న కారణాలను వెల్లడించాలని అలాగే ఆహ్వాన పత్రిక రూపకల్పనలో బాధ్యులైన వారిని గుర్తించి వివరణ కోరాలని, దేవస్థానం చైర్మన్, డైరెక్టర్ల బాధ్యతపై సమగ్ర విచారణ జరిపించాలని .దళిత ప్రజాప్రతినిధికి జరిగిన అవమానంపై సంబంధిత అధికారులు బాధ్యత వహించి సమాధానం చెప్పాలని. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దేవాదాయ శాఖ స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని, జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. సర్పంచ్ పదవి కేవలం ఒక వ్యక్తికి లభించిన హోదా కాదని, గ్రామ ప్రజలు తమ ఓటు ద్వారా కల్పించిన ప్రజాస్వామ్య అధికారమని పేర్కొన్నారు. ఆ పదవికి గౌరవం ఇవ్వకపోవడం గ్రామ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని స్పష్టం చేశారు.ఈ రాస్తారోకోలో తిమ్మాపూర్ సర్పంచ్ పోసాన్‌పల్లి రాజు, పీర్లపల్లి సర్పంచ్ ఓంప్రకాష్ కుమార్, మాదిగ సంఘాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాదిగ జేఏసీ మండల అధ్యక్షుడు మాసపాక యాదగిరి, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు జె. హరిబాబు, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి నీరుడి స్వామి, సామాజిక హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొడకండ్ల నర్సింలు, ఎంఎస్‌పీ మండల ఉపాధ్యక్షుడు మాచర్ల రాంచంద్రం, ఎంఆర్‌పీఎస్ మండల ఉపాధ్యక్షుడు పైసా స్వామి, రతన్, చాట్లపల్లి ఉపసర్పంచ్ లింగారి కరుణాకర్‌తో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి పారవశ్యంలో లక్ష దీపోత్సవం





- **కార్తీక పౌర్ణమి వేళ వైభవంగా తులసి కళ్యాణం**
- **దీపాల వెలుగులతో ఆధ్యాత్మిక శోభ**

గుమ్మడిదల, నవంబర్ 24:

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవిత్ర కార్తీక మాసంలో అత్యంత విశిష్టమైన రోజుగా భావించే పౌర్ణమి సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణలు, సంప్రదాయబద్ధమైన పూజా విధానాల మధ్య తులసి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తుల భాగస్వామ్యంతో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో దీపాలను వెలిగించడంతో ఆలయ ప్రాంగణమంతా దీప కాంతులతో కళకళలాడింది. వెలుగుల మధ్య జరిగిన ఈ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్తీక పౌర్ణమి ప్రాముఖ్యతను చాటిచెప్పేలా నిర్వహించిన ఈ దీపోత్సవంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తులసి కళ్యాణాన్ని వీక్షించి స్వామివారి, అమ్మవారి ఆశీస్సులు పొందారు. దీపారాధనతో ఆలయ పరిసరాలు భక్తి భావంతో నిండిపోయాయి. కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాసంలో దీపారాధనకు ఎంతో విశిష్టత ఉండటంతో లక్ష దీపోత్సవ కార్యక్రమం ఆనందాన్ని నింపింది. సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకతో బొంతపల్లి ఆలయంలో పౌర్ణమి పర్వదినం భక్తిమయంగా ముగిసింది.

రామాయంపేటలో ఘనంగా గురు నానక్ జయంతి..

- **మున్సిపల్ చైర్ పర్సన్ కు ఘనంగా సన్మానం.**

రామాయంపేట, నవంబర్ 24:

మంగళవారం నాడు రామాయంపేట పట్టణంలో గురు నానక్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి.గురునానక్ జయంతి వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. సిక్కుల ప్రథమ గురువు శ్రీ గురునానక్ దేవ్ జీ జయంతిని పురస్కరించుకుని రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డు, జాతీయ రహదారి44 (NH44) పక్కన గల గురునానక్ ఆలయంలో మంగళవారం ప్రత్యేక ప్రార్థనలు, వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై ఆలయంలో ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు మాట్లాడుతూ, గురునానక్ బోధనలు నేటి సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. మానవత్వం, సమానత్వం, సోదరభావం మరియు ప్రేమ వంటి ఉన్నత విలువలను ఆయన ప్రపంచానికి చాటిచెప్పారని కొనియాడారు. శాంతి, సమానత్వం, మానవత్వం అనే విలువలు మన నిత్య జీవితంలో ఎంతో ప్రేరణనిస్తాయని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన సన్మార్గంలో నడవాలని ఆకాంక్షించారు.అనంతరం సిక్కు సోదరులు చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పుట్టి సందీప్, దేవుని రంజిత్, డాకి శ్యామల స్వామి, కోఆప్షన్ సభ్యులు దేమే యాదగిరి, మాజీ కౌన్సిలర్ సుందర్ సింగ్‌తో పాటు స్థానిక సిక్కు సోదరులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ముత్తాయి కోట సిద్ధేశ్వర ఆలయంలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

- **భక్తులతో కిటకిటలాడిన ఆలయం..**
- **ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు**

మెదక్ నవంబర్ 24:

హవేలి ఘనపూర్ మండలం ముత్తాయి కోటలోని శ్రీ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా, భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల రాకతో సందడిగా మారింది. భక్తులతో ఆలయం కిటకిటలాడింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని తలపించాయి. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి కుటుంబ సమేతంగా స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గోవింద్ మహారాజ్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు.ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది.



రోడ్డు ప్రమాదంలో కేసీఆర్ అటెండర్ మృతి

ముస్తాబాద్ నవంబర్24



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బందనకల్ సమీపంలో లారీ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో కేసీఆర్ అటెండర్ కస్తూరి మహేందర్ రెడ్డి అలియాస్ మణికుమార్ రెడ్డి అక్కడిక్కడే మృతి చెందారు. బైక్‌పై ఉన్న భరత్ తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.మణికుమార్ రెడ్డి మృతి విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ ఎంపీ జనగామ శరత్ రావుతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి, అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

కార్తీక పౌర్ణమి సందర్భంగా కేతకీ సంగమేశ్వర స్వామివారిని దర్శించుకున్న జహీరాబాద్ ఎంపీ

సంగారెడ్డి జిల్లా సమయం న్యూస్

నవంబర్ 24 జహీరాబాద్ పార్లమెంటు నియోజకవర్గం - ఝరాసంగంకార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఝరాసంగం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామివారిని జహీరాబాద్ పార్లమెంటు సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్ గారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ గారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు.అదేవిధంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా ఝరాసంగం మండల కేంద్రంలో నిర్వహించిన పోలియో చుక్కల కార్యక్రమంలో కూడా పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.ఈ కార్యక్రమంలో ఝరాసంగం మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ శంకర్ పటేల్, హనుమంతరావు పటేల్, న్యాకల్ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



లక్నోలో ఘనంగా ముగిసిన 'తహ్బీబ్ ఫెస్టివల్ 2026'

- **అంతర్జాతీయ ముషాయిరా ప్రత్యేక ఆకర్షణ.. డాక్టర్ హరియోమ్ గజల్స్‌కు విద్యార్థుల విశేష స్పందన**

లక్నో, నవంబర్ 24:

తహ్బీబ్ గ్లోబల్ కన్వీనర్ తారిఖ్ ఫైజీ సమన్వయంతో లక్నోలోని ఇంటిగ్రల్ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు నిర్వహించిన 'తహ్బీబ్ ఫెస్టివల్ 2026' ఘనంగా ముగిసింది. సుమారు 25 వేల నుంచి 30 వేల మంది పాల్గొన్న ఈ ఉత్సవం సాహిత్యం, కళలు, సంస్కృతి, సంగీతం, వ్యాపార రంగాల సమ్మేళనంగా నిలిచింది. ఫెస్టివల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ ముషాయిరా ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రముఖ గజల్ గాయకుడు, సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ హరియోమ్ తన గజల్స్‌తో ప్రేక్షకులను అలరించారు. ముఖ్యంగా విద్యార్థులు ఆయన ప్రదర్శనకు ఉత్సాహంగా స్పందించారు. దుబాయ్‌కు చెందిన ఎమిరాతీ కవి మహమ్మద్ అల్ హెబ్సీ అరబిక్ కవిత్వాన్ని వినిపించగా, దానికి హిందీ అనువాదాన్ని అందించారు. ఆయన పాల్గొనడం భారత్-యూఏఈ సాంస్కృతిక, సాహిత్య సంబంధాలకు ప్రతీకగా నిలిచింది. దుబాయ్‌కు చెందిన దీబా ఇర్ఫాన్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆహారం, హస్తకళలు, ఫ్యాషన్, సృజనాత్మక ఉత్పత్తుల స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. యువత, విద్యార్థుల చురుకైన భాగస్వామ్యం ఫెస్టివల్‌కు ప్రత్యేక శోభను తీసుకువచ్చింది. 'People | Cultures | Ideas' అనే నినాదంతో పనిచేస్తున్న తహ్బీబ్ గ్లోబల్ సాహిత్యం, సంగీతం, కళలు, కవిత్వం ద్వారా అంతర్జాతీయ సాంస్కృతిక మార్పిడిని ప్రోత్సహిస్తోంది. ఇంటిగ్రల్ యూనివర్సిటీ సహకారంతో నిర్వహించిన ఈ ఫెస్టివల్ లక్నోలోని గంగా-జమునీ తహజీబ్‌కు అంతర్జాతీయ వేదికను కల్పించింది.



వాతావరణ సవాళ్లకు శాస్త్రీయ పరిష్కారాలే లక్ష్యం

- **ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూ.10 వేల కోట్ల కార్యాచరణ**

హైదరాబాద్: వాతావరణ మార్పుల సవాళ్లకు శాస్త్రీయంగా నిరూపితమైన, ఆచరణాత్మక పరిష్కారాలను సూచించే వేదికగా తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ నిలవాలని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహించనున్న క్లైమేట్ కాంక్లేవ్ ఏర్పాట్లపై మంత్రి సమీక్ష నిర్వహించారు. కరువు నివారణ, నీటి భద్రత, సుస్థిర వ్యవసాయం, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే చర్యలపై ప్రధానంగా చర్చించాలని సూచించారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఐదు నెలల ఎల్‌నినో సన్నద్ధత కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. సుమారు రూ.10 వేల కోట్లతో చెరువులు, వాగులు, కాలువల పునరుద్ధరణ, భూగర్భ జలాల రీఛార్జ్, వర్షపు నీటి సంరక్షణ వంటి పనులు చేపట్టనున్నారు.ఇక్రిశాట్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన వాతావరణ అనుకూల విధానాలను కాంక్లేవ్ ప్రదర్శనల్లో పొందుపరచాలని మంత్రి సూచించారు. పునరుత్పాదక ఇంధనం, నీటి పునర్వినియోగం, గ్రీన్ క్రెడిట్లు, పర్యావరణ పర్యాటకం, సర్క్యులర్ ఎకానమీ రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై కూడా చర్చలు జరగనున్నాయి.క్లైమేట్ కాంక్లేవ్ ద్వారా వాతావరణ మార్పులను తట్టుకునే సుస్థిర అభివృద్ధిలో తెలంగాణను దేశానికి మార్గదర్శకంగా నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.



సుప్రీం ఆదేశాలను అడ్డుకుంటే సహించం

కార్తీక దీపం వెలిగింపుపై మద్రాస్ హైకోర్టు స్పష్టీకరణ

రివ్యూ పిటిషన్ ఉన్నా నవంబర్ 20 ఉత్తర్వులు అమలు చేయాల్సిందే

మత స్వేచ్ఛకు భంగం కలగకుండా ఆంక్షల అమలుకు సూచన

అక్రమంగా నిర్బంధించిన వారిని తక్షణమే విడుదల చేయాలని ఆదేశం

చెన్నై, నవంబర్ 24 (సమయం న్యూస్): సుప్రీంకోర్టు తీర్పులను ఎవరైనా విమర్శించవచ్చని, అయితే వాటి అమలును అడ్డుకునే నిరసనలను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని మద్రాస్ హైకోర్టు స్పష్టం చేసింది. తిరుప్పరంకుండ్రం కొండపై కార్తీక దీపం వెలిగించే విషయంలో సుప్రీంకోర్టు నవంబర్ 20న ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా నిరసనలకు పిలుపునివ్వడాన్ని నిలువరించే ఉద్దేశంతో ఈ ఉత్తర్వులు జారీ చేసింది. తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసినంత మాత్రాన ఆదేశాల అమలును నిలిపివేయడానికి వీల్లేదని జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ ఎండీ సుమతిలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. రివ్యూ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వనందున నవంబర్ 20 నాటి ఆదేశాలను జిల్లా కలెక్టర్, పోలీసులు, దేవస్థానం అధికారులు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 144 ప్రకారం సుప్రీంకోర్టుకు సహకరించాల్సిన బాధ్యత మదురై కలెక్టర్‌పై ఉందని గుర్తుచేసింది. ఇతర అధికారుల నుంచి వ్యతిరేక సూచనలు వచ్చినా పట్టించుకోకుండా కొండపై కార్తీక దీపం వెలిగేలా చూడాలని పేర్కొంది.

మరోవైపు, కార్తీక దీపం సందర్భంగా కొండపైకి వెళ్లడం, గుమిగూడటంపై కలెక్టర్ విధించిన నిషేధాజ్ఞలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ధర్మాసనం విచారించింది. బీఎన్ఎస్ సెక్షన్ 163 కింద విధించిన ఆంక్షలను రాజ్యాంగంలోని ఆర్టికల్ 25 కల్పించిన మత స్వేచ్ఛకు భంగం కలగకుండా అమలు చేయాలని సూచించింది. నిషేధాజ్ఞల పేరుతో ఎవరినైనా అక్రమంగా నిర్బంధించి ఉంటే వెంటనే విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. కాగా, తిరుప్పరంకుండ్రం కొండపై రాతి స్తంభం వద్ద కార్తీక దీపం వెలిగించేందుకు దేవస్థానం బృందం, అధికారులకు సుప్రీంకోర్టు నవంబర్ 20న ఒక్కసారి మాత్రమే అనుమతినిచ్చింది. దీనిని భవిష్యత్తులో హక్కుగా లేదా సంప్రదాయంగా పరిగణించరాదని స్పష్టం చేస్తూనే, సమీపంలోని దర్గా, మసీదు వద్ద గుమిగూడటం, ఊరేగింపులు, నినాదాలపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.


సైనికులకు 87 మొబైల్ యాప్‌లపై నిషేధం

దేశ భద్రత దృష్ట్యా భారత సైన్యం కఠిన ఆంక్షలు

జాబితాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, పబ్‌జీ, టిండర్, ట్రూకాలర్

హనీట్రాప్, సైబర్ దాడుల నివారణకే ఈ నిర్ణయం

సైనికులు, అధికారులు, సిబ్బంది అందరికీ ఆదేశాలు



న్యూఢిల్లీ, నవంబర్ 24 (సమయం న్యూస్): దేశ భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిచ్చే భారత సైన్యం, సైనికులు తమ మొబైల్ ఫోన్లలో వినియోగించే యాప్‌లపై కఠిన ఆంక్షలు విధించింది. సోషల్ మీడియా, డేటింగ్, గేమింగ్ విభాగాలకు చెందిన మొత్తం 87 రకాల మొబైల్ అప్లికేషన్లను ఉపయోగించకూడదని సైనికులు, అధికారులు సహా సిబ్బంది అందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ యాప్‌ల ద్వారా దేశ విద్రోహ శక్తులు, శత్రు దేశాల నిఘా సంస్థలు సైనికులను లక్ష్యంగా చేసుకునే ప్రమాదం ఉందని సైన్యం ఆందోళన వ్యక్తం చేస్తోంది. సైనికుల వ్యక్తిగత వివరాలు, లొకేషన్, విధులకు సంబంధించిన కీలక సమాచారంతో పాటు నెట్టింట షేర్ చేసే ఫొటోలు, వీడియోలు దేశ భద్రతకు ముప్పుగా మారే అవకాశం ఉన్నందున ఈ చర్యలు తీసుకుంది. సైనికులు హనీట్రాప్, సైబర్ దాడుల బారిన పడకుండా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. సోషల్ మీడియా వినియోగంపై భారత సైన్యం ఎప్పటికప్పుడు మార్గదర్శకాలను సవరిస్తూ వస్తోంది. గతంలోనూ కొన్ని వేదికల్లో కేవలం సమాచారాన్ని వీక్షించేందుకు మాత్రమే అనుమతిచ్చి, పోస్టులు, కామెంట్లు, సందేశాలపై పరిమితులు విధించింది. తాజా నిషేధిత జాబితాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్‌తో పాటు పబ్‌జీ, క్లాష్ ఆఫ్ కింగ్స్ వంటి గేమింగ్ యాప్‌లు, టిండర్, హింజ్, బంబుల్ వంటి డేటింగ్ యాప్‌లు ఉన్నాయి. వీటితో పాటు వీచాట్, షేర్‌ఇట్, యూసీ బ్రౌజర్, ట్రూకాలర్, జూమ్, డైలీహంట్ తదితర యాప్‌లపైనా ఆంక్షలు అమల్లోకి వచ్చాయి.

రాజీవ్ భద్రత తొలగింపు యాదృచ్ఛికం కాదు

- **ఉద్దేశపూర్వకంగానే కమాండో భద్రత తగ్గించారని ఆరోపణ**
- **హత్యకు ముందే తల్లిదండ్రుల వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్లు వెల్లడి**
- **బీహార్ ప్రచారంలో రాళ్ల దాడిని గుర్తుచేసుకున్న సోనియా గాంధీ**
- **'బిలాంగింగ్' పుస్తకంపై ప్రత్యేక సంభాషణలో రాహుల్ సంచలన వ్యాఖ్యలు**



హైదరాబాద్, నవంబర్ 24 (సమయం న్యూస్): మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యకు దారితీసిన పరిస్థితులపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన తండ్రికి కల్పించిన భద్రతను ఉద్దేశపూర్వకంగానే తొలగించారని, అది యాదృచ్ఛికంగా జరిగిన పొరపాటు కాదని ఆయన ఆరోపించారు. తన తల్లి సోనియా గాంధీ రచించిన జ్ఞాపకాల పుస్తకం 'బిలాంగింగ్' గురించి ఆమెతోనూ, సోదరి ప్రియాంక గాంధీతోనూ కలిసి పాల్గొన్న ప్రత్యేక వీడియో సంభాషణలో రాహుల్ ఈ విషయాలను వెల్లడించారు.

బీహార్ పర్యటనలోనే హెచ్చరించా

1984లో ఇందిరాగాంధీ హత్య అనంతరం ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ, 1989 ఎన్నికల్లో ఓటమి తర్వాత ప్రతిపక్ష నేతగా కొనసాగారు. ఆ సమయంలో ఆయనకు ఉన్న కమాండో భద్రతను తగ్గించడంపై రాహుల్ ఆవేదన వ్యక్తం చేశారు. 1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబదూర్‌లో ఎల్టీటీఈ ఆత్మాహుతి దాడిలో రాజీవ్ ప్రాణాలు కోల్పోవడానికి కొంతకాలం ముందు, తండ్రితో కలిసి బీహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఆ పర్యటనలో తీవ్ర భద్రతా లోపాలు కనిపించాయని సోనియా గాంధీ గుర్తుచేసుకున్నారు. ఓపెన్‌టాప్ జీపులో ప్రచారం చేస్తుండగా కొందరు రాళ్లు విసిరారని, అప్పటి బీహార్ ప్రభుత్వం భద్రతపై తగిన జాగ్రత్తలు తీసుకోలేదని ఆమె ఆరోపించారు. ఆ పర్యటన తర్వాత రాహుల్ తనతో మాట్లాడుతూ.. తండ్రి భద్రతపై వెంటనే చర్యలు తీసుకోకపోతే ఆయన అంత్యక్రియలకు హాజరుకావాల్సిన పరిస్థితి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసినట్లు సోనియా వెల్లడించారు.

బీహార్ పర్యటన అనుభవాలు తన అనుమానాలను మరింత బలపరిచాయని రాహుల్ పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ హత్యకు అనుకూల పరిస్థితులను ఉద్దేశపూర్వకంగానే కల్పించారని ఆరోపించిన ఆయన, భద్రత విషయమై అప్పట్లో తల్లితోనే కాకుండా తండ్రితోనూ వాదించినట్లు తెలిపారు. అయితే, భద్రత తొలగింపు వెనుక ఉద్దేశపూర్వక చర్య ఉందన్నది రాహుల్ చేసిన ఆరోపణ మాత్రమే.

యూపీలో కాంగ్రెస్‌కు 26 సీట్లు: ఎస్పీ

అసెంబ్లీ ఎన్నికల సీట్ల పంపకంపై వాడివేడి చర్చలు


తొలి విడతలో కుదరని ఏకాభిప్రాయం.. రెండో దఫా భేటీపై ఉత్కంఠ

భారీగా స్థానాలు ఆశిస్తున్న హస్తం పార్టీ

2027 ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మళ్లీ జతకట్టిన పార్టీలు

న్యూఢిల్లీ, నవంబర్ 24 (సమయం న్యూస్): వచ్చే ఉత్తర్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 26 సీట్లు కేటాయించాలని ప్రతిపాదించినట్లు సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎంపీ రాజీవ్ రాయ్ మంగళవారం వెల్లడించారు. సీట్ల పంపకంపై ఇరు పార్టీల మధ్య వాడివేడిగా చర్చలు కొనసాగుతున్నాయని ఆయన మీడియాకు తెలిపారు. అయితే సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రాలేదని తెలుస్తోంది. సోమవారం న్యూఢిల్లీలో జరిగిన మొదటి విడత చర్చల్లో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో, మంగళవారం రెండో విడత భేటీ జరగనుంది. ఈ సమావేశం తర్వాతే సీట్ల కేటాయింపుపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. గతంలో 181 సీట్లు కావాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్, ప్రస్తుతం కొంత వెనక్కి తగ్గి వంద నుంచి రెండు వందల స్థానాల వరకు ఇస్తే చాలని కోరుతున్నట్లు మీడియా వర్గాలు పేర్కొంటున్నాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ భారీగా సీట్లు ఆశిస్తోందని, ఇప్పటికే పోటీ చేయాలనుకుంటున్న నియోజకవర్గాల జాబితాను సిద్ధం చేసిందని విశ్లేషకులు చెబుతున్నారు. కాగా, 2017 యూపీ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేసిన ఈ రెండు పార్టీలు ఘోర పరాజయాన్ని చవిచూశాయి. అప్పట్లో 107 చోట్ల పోటీ చేసిన కాంగ్రెస్ కేవలం 7 సీట్లే గెలవగా, అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని ఎస్పీ 47 స్థానాలకే పరిమితమైంది. 2022లో విడిగా బరిలోకి దిగిన ఈ పార్టీలు, 2027 ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించాలనే వ్యూహంతో మళ్లీ జతకట్టాయి.





అంతరిక్షంలో రష్యా అణు అస్త్రం?

60 రోజుల్లోనే ప్రయోగానికి సన్నాహాలన్న జర్మనీ నివేదిక

2026 చివరి నాటికి అణ్వాయుధ ఉపగ్రహం ప్రయోగించే వీలు

అంతర్జాతీయ ఒప్పందాల ఉల్లంఘనపై తీవ్ర ఆందోళన

నిరాధార ఆరోపణలంటూ కొట్టిపారేసిన క్రెమ్లిన్

బెర్లిన్, నవంబర్ 24 (సమయం న్యూస్): అంతరిక్షంలో అణ్వాయుధాలను మోహరించేందుకు అగ్రరాజ్యాల మధ్య పోటీ తీవ్రమవుతోంది. అమెరికా ఇప్పటికే అటువంటి ఆయుధాల మోహరింపును అంగీకరించిన వేళ, 2026 చివరి నాటికి అణ్వాయుధంతో కూడిన ఉపగ్రహాన్ని ప్రయోగించేందుకు రష్యా సిద్ధమవుతోందని జర్మనీ నుంచి వెలువడిన నివేదిక సంచలనం రేపుతోంది. జర్మన్ నిఘా వర్గాలు, స్థానిక మీడియా కథనాల ప్రకారం కేవలం 60 రోజుల వ్యవధిలోనే అంతరిక్షంలోకి అణ్వాయుధాలను పంపేందుకు మాస్కో ఏర్పాట్లు చేస్తోంది. ఈ వ్యూహాలపై నిఘా వర్గాలు ఇప్పటికే జర్మనీ రక్షణ మంత్రికి వివరించగా, ఆ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ పరిణామాలను నిశితంగా పర్యవేక్షిస్తోంది. ఒకవేళ రష్యా ఈ ప్రయోగం చేస్తే 1963 పాక్షిక అణు పరీక్షల నిషేధ ఒప్పందంతో పాటు 1967 బాహ్య అంతరిక్ష ఒప్పందాన్ని ఉల్లంఘించినట్లే అవుతుంది. జర్మనీ నివేదికకు బలం చేకూరుస్తూ రష్యా ప్రభుత్వ వార్తా సంస్థ 'టాస్' ఓ కథనాన్ని ప్రచురించింది. ఉక్రెయిన్, నాటో దేశాల నిర్ణయాలు అణ్వాయుధాల వినియోగాన్ని పరిశీలించేలా మాస్కోపై ఒత్తిడి తెస్తున్నాయని రష్యా భద్రతా మండలి డిప్యూటీ చైర్మన్ దిమిత్రి మెద్వెదేవ్ వ్యాఖ్యలను ఉటంకించింది. అయితే అధ్యక్షుడు పుతిన్ ఏ నిర్ణయమైనా సమగ్రంగా విశ్లేషించాకే తీసుకుంటారని, ప్రతీకార చర్య జరిగిన నష్టానికి అనుగుణంగానే ఉంటుందని పేర్కొంది. మరోవైపు క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్, బెర్లిన్‌లోని రష్యా రాయబార కార్యాలయం ఈ నివేదికను పూర్తిగా నిరాధారమైనదిగా కొట్టిపారేశాయి. ఉక్రెయిన్ దళాలు వాడుతున్న స్టార్‌లింక్ వంటి ఉపగ్రహ నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయగల అణ్వాయుధాన్ని రష్యా అభివృద్ధి చేస్తోందని అమెరికా 2024లోనూ, ఇటీవలా ఆరోపించిన నేపథ్యంలో తాజా నివేదిక అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది.

ఎన్‌విడియా సీఈవోగా మళ్లీ జెన్సన్ హువాంగ్

రాజీనామా చేసిన 11 రోజుల్లోనే అనూహ్య పునరాగమనం

వాషింగ్టన్, నవంబర్ 24 (సమయం న్యూస్) : ప్రపంచ టెక్నాలజీ రంగంలో సంచలనం సృష్టించిన చిప్‌ల తయారీ దిగ్గజం ఎన్‌విడియాలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. వ్యక్తిగత వివాదాలు, అనైతిక సంబంధాల ఆరోపణలతో సీఈవో పదవికి రాజీనామా చేసిన సంస్థ సహ వ్యవస్థాపకుడు జెన్సన్ హువాంగ్ కేవలం 11 రోజుల్లోనే తిరిగి అదే బాధ్యతలు చేపట్టారు. నవంబర్ 12న ఆయన రాజీనామాను ఆమోదించిన బోర్డు, నవంబర్ 23న ఏకగ్రీవంగా పునర్నియామకానికి పచ్చజెండా ఊపింది. దీంతో తాత్కాలిక సీఈవోగా ఉన్న కోలెట్ క్రెస్ తిరిగి సీఎఫ్ఓ బాధ్యతల్లోకి వెళ్లారు. సంస్థలో తనకు నేరుగా నివేదించే మహిళా ఉద్యోగినితో పాటు, చైనా నిఘా వర్గాలతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై దర్యాప్తు ఎదుర్కొంటున్న వ్యాపారవేత్త అలిస్ హువాంగ్‌తో జెన్సన్‌కు వివాహేతర సంబంధాలు ఉన్నట్లు కథనాలు రావడంతో ఆయన క్షమాపణలు చెప్పి తప్పుకున్నారు. అయితే ఏఐ రంగంలో ఆయన నాయకత్వం కీలకమని భావించిన ఉద్యోగులు, పెట్టుబడిదారులు 'స్టాండ్ విత్ జెన్సన్' పేరిట బహిరంగ లేఖకు మద్దతు కూడగట్టారు. సుమారు 10 వేల మంది ఎన్‌విడియా ఉద్యోగులు సహా రెండు లక్షలకు పైగా సంతకాలు రాగా, ఎలాన్ మస్క్ కూడా మద్దతు పలికారు. నవంబర్ 17న జెన్సన్‌ను తిరిగి నియమించే ఆలోచన లేదని బోర్డు ఛైర్మన్ హార్వే జోన్స్ స్పష్టం చేసినా, అనంతరం పరిస్థితులు వేగంగా మారాయి. పునరాగమనానికి ముందు హువాంగ్ బోర్డుతో గంటల తరబడి సమావేశమై, గతంలో వెలుగులోకి వచ్చిన మూడు సంబంధాలన్నింటినీ నిజాయితీగా ఒప్పుకుని పశ్చాత్తాపం వ్యక్తం చేసినట్లు 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' పేర్కొంది.



ట్రంప్ జోక్యంతో మారిన కథ

చైనాతో సాంకేతిక, ఆర్థిక పోటీలో అమెరికా ఆధిపత్యం నిలవాలంటే ఎన్‌విడియా నాయకత్వ స్థిరత్వం అవసరమని భావించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏకంగా తన యంత్రాంగాన్ని రంగంలోకి దింపారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో పాటు వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్, ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ మూడు రోజుల పాటు బోర్డుతో చర్చలు జరిపారు. ట్రంప్ సైతం బోర్డు సభ్యులతో వ్యక్తిగతంగా మాట్లాడి, హువాంగ్ పునర్నియామకంతో జాతీయ భద్రతకు ముప్పు ఉండదని స్పష్టం చేశారు. ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్ వంటి క్లోజ్డ్ మోడల్స్ కంటే చౌకైన ఓపెన్ సోర్స్ ఏఐ మోడల్స్‌కు హువాంగ్ మద్దతుదారు కావడం, అమెరికా సంస్థలు చైనా మోడల్స్‌పై ఆధారపడకుండా చూసే వ్యూహమే ట్రంప్ మద్దతుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. సిలికాన్ వ్యాలీలో తనకున్న పరిచయాలతో జేడీ వాన్స్ బోర్డును ఒప్పించడం 2028 అధ్యక్ష ఎన్నికల దృష్ట్యా ఆయనకూ రాజకీయంగా కీలకంగా మారింది.